
www.vaarthavedhikasurya.com
PRGI.NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 1 | సంచిక: 325 | మంగళవారం, 21 ఏప్రిల్, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి | పేజీలు: 8 | వెల: 5-00 |
|---|---|---|---|---|---|---|
| YADADRI BHUVANAGIRI | VOLUME : 1 | ISSUE : 325 | TUESDAY, APRIL 21, 2026 | EDITOR : POLOJU SRINIVASA CHARY | PAGES : 8 | RS : 5-00 |

## భారీ భూకంపం

- రిక్టర్ స్కేలుపై 7.4 తీవ్రత నమోదు • సునామీ హెచ్చరికలు జారీ • సుమారు 3 మీటర్ల ఎత్తుతో సముద్ర అలలు ఎగిసిపడే అవకాశాలున్నట్లు వార్నింగ్



2 లో..



## కేసీఆర్.. నువ్వో, నేనో తేల్చుకుందాం..

- లేకుంటే నా పేరు మార్చుకుంటా..
- కాంగ్రెస్ కార్యకర్తల సాక్షిగా ఇదే నా శపథం
- కాటారం సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- బహిరంగ సభా వేదికపైనే రెండో విడత 'రైతు భరోసా' నిధులు విడుదల
- రైతు సంక్షేమమే కాంగ్రెస్ నినాదమని ఉద్ఘాటన
- పంటలకు గిట్టుబాటు ధర తీసుకొచ్చిందే కాంగ్రెస్ అని వ్యాఖ్య

### వచ్చే 2029 ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా ఊడగొడతా

జయశంకర్ భూపాలపల్లి, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 20:

రైతు భరోసా రెండో విడత నిధులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. 40 లక్షల మంది రైతులకు రైతు భరోసా ఇస్తున్నామని స్పష్టం చేశారు. రైతు సంక్షేమం.. కాంగ్రెస్ నినాదమే కాదు, విధానమని ఉద్ఘాటించారు. పంటలకు గిట్టుబాటు ధర తీసుకొచ్చిందే కాంగ్రెస్ అని వ్యాఖ్యానించారు. వరికి రూ.500 బోనస్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని నొక్కిచెప్పారు. ఈరోజు(సోమవారం) జయశంకర్ మిగతా 2లో..

## శాపాలు పెడతారా?

### వెయ్యి జన్మలెత్తినా చావను..

- చివరి శ్వాస వరకు తెలంగాణ అభివృద్ధి కోసమే పనిచేస్తా
- తెలంగాణ రాకముందు ఈ ప్రాంతంలో భయంకర పరిస్థితులు
- నేను సభ పెడితేనే రెండోవిడత రైతుబంధు ఇస్తారా..?
- జగిత్యాల ప్రజా ఆశీర్వాద సభలో కాంగ్రెస్‌పై కేసీఆర్ ధ్వజం
- సభా వేదికగా బీఆర్ఎస్‌లో చేరిన మాజీ మంత్రి జీవన్‌రెడ్డి
- కండువా కప్పి ఆహ్వానించిన కెసిఆర్..
- జీవన్‌రెడ్డిని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా కెసిఆర్ ప్రకటన



జగిత్యాల, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 20:

తెలంగాణ రాకముందు ఈ ప్రాంతంలో భయంకర పరిస్థితులు ఉండేవని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు వ్యాఖ్యానించారు. గతంలో తెలంగాణ పదం పలకడానికే భయపడే రోజులు ఉండేవని పేర్కొన్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసమే బీఆర్ఎస్‌లో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి చేరారని తెలిపారు. 45ఏళ్ల నుంచి జీవన్‌రెడ్డితో తమకు స్నేహం ఉందని ప్రస్తావించారు. సోమవారం జగిత్యాలలో కేసీఆర్ పర్యటించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో కేసీఆర్ సమక్షంలో జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేసీఆర్ ప్రసంగించారు. భిన్న రాజకీయ పార్టీల వల్లే జీవన్‌రెడ్డి, తాము వేర్వేరుగా పనిచేశామన్నారు. జీవన్‌రెడ్డి గుండె ధైర్యంతో పార్టీ మారాలనే నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. జీవన్‌రెడ్డిని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని వెల్లడించారు. ఆయన ప్రజాజీవితం ఎంతోమందికి ఆదర్శమని ప్రశంసించారు. జీవన్‌రెడ్డి చేరికతో బీఆర్ఎస్‌కు ఊపు వస్తోందన్నారు. జీవన్‌రెడ్డితో కలిసి అన్నదమ్ముల్లా తాము మిగతా 2లో..





## కాళేశ్వరం కూలిపోవడం కేసీఆర్ అవినీతికి నిదర్శనం

- ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో అవినీతికి పాల్పడ్డారు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపణ

2 లో..

## 23న కేబినెట్ సమావేశం

- 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' ప్రారంభంపై చర్చ
- పరిషత్ ఎన్నికలు, ఇద్దరు ఎమ్మెల్సీలు, ఆర్టీసీ సమ్మె,ఉద్యోగుల సమస్యలు, యాసంగి ధాన్యం సేకరణపైనా
- మెట్రోరైలు మొదటి దశ స్వాధీనంపైనా చర్చించే చాన్స్

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 20:

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 23న జరగనుంది. సచివాలయంలోని ఆరో అంతస్తులో గల క్యాబినెట్ మీటింగ్ హాల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం ప్రారంభం కానుంది. సమావేశానికి అవసరమైన సమాచారంతో అందుబాటులో మిగతా 2లో..

## అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ సమ్మె

### ప్రభుత్వంలో విలీనం.. ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 20:

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతోపాటు ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ ఆర్టీసీ జేఏసీ మంగళవారం అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి దిగుతోంది. ఏప్రిల్ 22న మొదటి డ్యూటీ నుంచి సమ్మె చేపడతామని ఆర్టీసీ జేఏసీ సమ్మె నోటీస్‌లో పేర్కొన్న విషయం తెలిసిందే. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంబంధించి ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ, చర్చలకు అధికారికంగా ఆహ్వానం అందకపోవడంతో పూర్తిస్థాయిలో సమ్మె చేపట్టేందుకు మిగతా 2లో..

## అవమానించారని తమ్ముడు, మరదలి దారుణ హత్య

- అప్పు చెల్లించక పోగా.. పిల్లల్లేరని, సంసారానికి పనికి రావని వ్యాఖ్య
- తమ్ముడు, మరదలుపై కత్తితో పొడిచి దారుణ హత్య



2 లో..



## ఘోర ప్రమాదం

- కొండ పైనుంచి బస్సు బోల్తా పడి 21 మంది మృతి.. మరో 51 మందికి గాయాలు
- 100 మీటర్ల ఎత్తు నుంచి పడి నుజ్జునుజ్జు
- జమ్మూకశ్మీర్‌లోని ఉధంపూర్ జిల్లాలో ఘటన

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని ఉధంపూర్ జిల్లాలో సోమవారం ఘోర బస్సు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణికులతో కిక్కిరిసిన ఓ ప్రైవేటు బస్సు కొండ పైనుంచి కిందకు పడిపోవడంతో 21 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 51 మంది గాయాలపాలయ్యారు. బస్సు వచ్చి ఒక ఆటో రిక్షాపై మిగతా 2లో..

## ప్రధానితో దక్షిణ కొరియా అధ్యక్షుడి భేటీ

- ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్ వేదికగా వివిధ అంశాలపై చర్చ



2 లో..



## వీధి కుక్కల దాడిలో చిన్నారి మృతి

- ఒంటిపై 300కు పైగా గాయాలు
- పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో ఘటన

2 లో..

సంపుటి: 1 సంచిక: 325 వార్త వేదిక సూర్య || మంగళవారం, 21 ఏప్రిల్, 2026 ||

# కేసీఆర్.. నువ్వో, నేనో తేల్చుకుందాం..

(మొదటి పేజీ తరువాయి)

భూపాలపల్లి జిల్లాలో సీఎం పర్యటించారు. అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా కూడా ఊడగొడతామని హెచ్చరించారు. కాళేశ్వరంలో రూ.లక్ష కోట్లు అవినీతికి పాల్పడ్డారని ఆగ్రహించారు. కేసీఆర్‌కు ఉరి వేసినా తప్పులేదని హెచ్చరించారు. వరుస ఎన్నికల విజయంతో బీఆర్ఎస్‌కు ఘోరీ కట్టామని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో తేల్చుకుందాం.. దమ్ముంటే రావాలని సవాల్ విసిరారు. ప్రజాపాలనో.. పాపాల భైరవుడో తేల్చుకుందామని వార్నింగ్ ఇచ్చారు. బీఆర్ఎస్ ఘోరీపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. YS, DSలా తాను, మహేశ్ కుమార్ గౌడ్ చరిత్రను పునరావృతం చేస్తామని స్పష్టం చేశారు. 2034 వరకు కాంగ్రెస్ పాలన కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యకర్తల సాక్షిగా ఇదే తన సవాల్ అని సీఎం పేర్కొన్నారు. ప్రజాపాలన ఎందుకు పోవాలో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి చెప్పాలని ప్రశ్నించారు. పేదలకు సన్నబియ్యం ఇస్తున్నందుకు ప్రజాపాలన పోవాలా..? అని నిలదీశారు. కేసీఆర్ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇచ్చారా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. రూ.20 లక్షల కోట్లు ఖర్చు చేశారని.. కానీ 20 వేల ఇళ్లు కూడా ఎందుకు కట్టలేదని నిలదీశారు. తమ హయాంలో 4.5 లక్షల ఇళ్లు ఇచ్చినందుకు ప్రజాపాలన పోవాలా..? అని ప్రశ్నించారు. జీవన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వనందుకు ప్రజాపాలన పోవాలా..? అని నిలదీశారు. ప్రజాపాలన పోవాలి.. పాపాల భైరవుడు రావాలని జీవన్‌రెడ్డి అంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజలు గడీల పాలన పోవాలనే.. కాంగ్రెస్ పాలన తెచ్చుకున్నారని ప్రస్తావించారు. జీవన్‌రెడ్డి మాజీ సీఎం ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి నాదెండ్ల భాస్కరరావుతో జతకట్టారని విమర్శించారు. జగిత్యాల కాంగ్రెస్ కార్యకర్తలు జీవన్‌రెడ్డిని పల్లకీపై మోశారని ప్రస్తావించారు. తమ ప్రభుత్వం గడీలకు ఊడిగం చేయాలా..? అని ప్రశ్నించారు. గతంలో ఆడబిడ్డలు బతుకమ్మ చీరలు కట్టి పండుగ చేసుకున్నారా..? అని నిలదీశారు. కేసీఆర్ హయాంలో పేదలకు సన్నబియ్యం ఇవ్వాలని ఎప్పుడైనా ఆలోచించారా..? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు.



## కాళేశ్వరం కూలిపోవడం కేసీఆర్ అవినీతికి నిదర్శనం

జయశంకర్ భూపాలపల్లి, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 20:

కాళేశ్వరం ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో కేసీఆర్ హయాంలో అవినీతికి పాల్పడ్డారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం ప్రపంచంలోనే అద్భుతమని మాజీ సీఎం కేసీఆర్ అన్నారని పేర్కొన్నారు. ఈ రోజు (సోమవారం) మేడిగడ్డ బ్యారేజీను పరిశీలించి ఇరిగేషన్ క్యాంపు కార్యాలయంలో మంత్రులు, ఎన్డీఎస్ఏ నిపుణులు, ఇరిగేషన్ అధికారులతో సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎన్డీఎస్ఏ చైర్మన్ అనిల్ జైన్, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమీక్షలో అధికారులకు పలు కీలక అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.

### ఆ లోపాలపై స్పష్టత వచ్చింది..

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల లోపాలపై ఎలా ముందుకెళ్లాలో ఓ స్పష్టత వచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సమస్యను అర్థం చేసుకోవడమే సగం పరిష్కారమని చెప్పుకొచ్చారు. సమస్యను పూర్తిగా అర్థం చేసుకున్నాకే అధికారులు పనులు ప్రారంభించాలని ఆదేశించారు. సేకరించిన శాంపిల్స్ రిజల్ట్‌కు అనుగుణంగా పనులు చేపట్టాలని సూచించారు. ఎన్డీఎస్ఏ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రతి పనిలో ఎన్డీఎస్ఏ అప్రూవల్ తీసుకుని పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావును.. కాళేశ్వర్ రావు అని అప్పటి గవర్నర్ నరసింహన్‌తో చెప్పించారని ప్రస్తావించారు. కేసీఆర్ అవినీతిని ప్రకృతే గుర్తించి మొదట బయటకు తీసిందని తెలిపారు. 2023 ఎన్నికల ముందు కాళేశ్వరం కూలిపోయిందని చెప్పుకొచ్చారు. అన్ని విషయాల్లో కాళేశ్వరం విఫలమైందని ఎన్డీఎస్ఏ రిపోర్ట్ ఇచ్చిందని పేర్కొన్నారు. కాళేశ్వరంపై శాసనసభలో చర్చించి సీబీఐ విచారణకు ఆదేశించామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తొమ్మిది నెలలైనా కేంద్ర ప్రభుత్వం సీబీఐ విచారణ ఎందుకు జరిపించడం లేదని ప్రశ్నించారు. ఈ విషయంపై తమ ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించాలని కేంద్రానికి తీర్మానం పంపిందని అన్నారు. కేసీఆర్, హరీశ్‌రావును జైల్లో వేయాలని, ఈ కేసును సీబీఐకి అప్పగించాలని కిషన్‌రెడ్డి ఆనాడు అనలేదా అని ప్రశ్నించారు. కానీ కేంద్ర ప్రభుత్వం దీనిపై నిర్లక్ష్యం వహించిందని ధ్వజమెత్తారు. అంతకుముందు సీబీఐ విచారణకు ఆదేశించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెప్పారని.. కానీ ఇప్పటి వరకూ చర్యలు ఎందుకు తీసుకోవట్లేదని నిలదీశారు. కాళేశ్వరం విచారణపై సీబీఐ ఎందుకు మౌనంగా ఉంది..? అని నిలదీశారు. తాము పదే పదే లేఖలు రాసినా ఎందుకు స్పందిచడం లేదు..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరంపై లక్షకోట్లు ఖర్చుచేసి లక్ష ఎకరాలకు సాగునీరు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. దీనిని తాము వదిలేయలేక, దీనిపై ఖర్చు చేయలేక సాంకేతిక నిపుణులతో ఇక్కడికి వచ్చామని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును రిపేర్ చేయాలని తమ ప్రభుత్వం సంకల్పించిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇవాళ నిర్వహించిన సమావేశానికి అధికారులతో, సాంకేతిక నిపుణులతో చర్చించాలని నెల రోజుల ముందే ప్లాన్ చేశామని తెలిపారు. నిజాలు బయటపడతాయని తెలిసి నేడు హడావుడిగా కేసీఆర్ అండ్ కో ఓ మీటింగ్ పెట్టుకుందని.. అయినా మేం అనుమతులు ఇచ్చామని స్పష్టం చేశారు. హరీశ్‌రావు తెలివితో మాట్లాడుతున్నారో, తెలివిలేక మాట్లాడుతున్నారో తెలియట్లేదని ఎద్దేవా చేశారు. శ్రీపాద ఎల్లంపల్లి ఈ ప్రాజెక్టుకు ప్రాణవాయువు అని ఉద్ఘాటించారు. హరీశ్‌రావు నిక్కర్‌తో తిరక్కముందే ఎల్లంపల్లి ప్రాజెక్టు ఉందని విమర్శించారు. ఎల్లంపల్లి నీటితోనే రాష్ట్రంలో అత్యధిక పంటలు పండించారని ప్రస్తావించారు. కాళేశ్వరంలో దోషులను వదిలేది లేదని హెచ్చరించారు.. దోషులను శిక్షించేందుకు అవసరమైన కార్యాచరణతో ముందుకెళ్తామని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టును కూడా ఊరికే వదలబోమని.. రిపేర్లు చేసి నీరు అందిస్తామని పేర్కొన్నారు. అయితే కేసీఆర్ హయాంలో చేసిన బండారం బయటపడుతుందని వాళ్లు ఈ రోజు మీటింగ్ పెట్టుకున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. సీబీఐ విచారణ జరుపుతారని బీజేపీ వాళ్ల కాళ్లు మొక్కించేందుకే హరీశ్‌రావు, వినోద్ రావు ఢిల్లీకి పోయారని విమర్శించారు. కాళేశ్వరంపై విచారణకు ఆదేశిస్తారని తెలిసి బీజేపీ నేతల కాళ్లు పట్టుకునేందుకు హరీశ్‌రావు ఢిల్లీకి పరుగెత్తారని విమర్శించారు. మీడియా బయటపెట్టినా వాళ్లు ఈ విషయంపై ఎలాంటి ప్రకటన ఎందుకు చేయలేదని నిలదీశారు. బీజేపీని అడ్డుపెట్టుకుని అవినీతి కేసుల నుంచి బయటపడతామంటే రాష్ట్ర ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

# నాకు శాపాలు పెడతారా?

(మొదటి పేజీ తరువాయి)

పనిచేస్తామని వివరించారు. బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా జీవన్‌రెడ్డికి తక్షణ బాధ్యతలు ఇస్తామని స్పష్టం చేశారు. కరీంనగరే కాదని.. చుట్టుపక్కల జిల్లాల్లోనూ జీవన్‌రెడ్డి పనిచేయాలని సూచించారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీవన్‌రెడ్డి కీలక బాధ్యతల్లో ఉంటారని పేర్కొన్నారు. గతంలో తెలంగాణ పదాన్నే నిషేధించే పరిస్థితులు ఉన్నాయని కేసీఆర్ తెలిపారు. మన నీళ్లు, వనరులను దోపిడీ చేశారని ధ్వజమెత్తారు. కొన్ని పార్టీల తీరుతో ఆవేశం, దు:ఖం వచ్చేదని చెప్పుకొచ్చారు. పాలమూరు లాంటి జిల్లాల్లో 90 శాతం వలసలే ఉన్నాయని ప్రస్తావించారు. గంజి కేంద్రాలు పెట్టిన అధ్వాన స్థితికి తెలంగాణను చేర్చారని తెలిపారు. కరెంట్ లేదు.. నీళ్లు లేవు.. దారుణ పరిస్థితులు ఉండేవని అన్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడినట్లుగా చంద్రబాబు కరెంట్ ఛార్జీలు పెంచారని చెప్పారు. కరెంట్ ఛార్జీలపై నిరసన తెలిపితే బషీర్‌బాగ్‌లో కాల్చి చంపారని విమర్శించారు. బషీర్‌బాగ్ ఘటనతోనే తెలంగాణ జెండా పట్టుకుని ఉద్యమం చేశానని ప్రస్తావించారు. బక్కపలచనోడు, ఇతనితో ఏమవుతుందని కొంతమంది తనను హేళన చేశారని గుర్తుచేశారు. మొక్కవోని దీక్షతో తెలంగాణ మొత్తం తిరిగి ఉద్యమించానని కేసీఆర్ ఉద్ఘాటించారు. మాజీ సీఎం రోశయ్య 14F జీవో తెస్తే ఉద్యోగ గర్జన చేపట్టామని ప్రస్తావించారు. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అంటూ దీక్ష చేపట్టానని తెలిపారు. తన దీక్షతో పార్లమెంట్ అల్లకల్లోలమైందని అన్నారు. మాజీ కేంద్రమంత్రి చిదంబరం వచ్చి తెలంగాణ ఇస్తామని ప్రకటన చేశారని తెలిపారు. ఆంధ్రోళ్ల ఒత్తిడితో మళ్లీ JAC పెట్టి పోరాడామని చెప్పుకొచ్చారు. తెలంగాణ వచ్చాక అందరినీ కలుపుకుని ఓ ప్రణాళికతో ముందుకెళ్లామని అన్నారు. కాకతీయ రాజుల పేరుతో చెరువులు బాగుచేసుకున్నామని తెలిపారు. పదేళ్లలో ఎన్ని చేశామో మీరే చూశారని ప్రస్తావించారు. మిషన్ భగీరథ పూర్తికాకపోతే ఓట్లు వేయొద్దని.. అసెంబ్లీలోనే తాను చెప్పానని అన్నారు. ఐదేళ్లలోనే మిషన్ భగీరథ పూర్తిచేసి మంచినీళ్లు ఇచ్చామని వ్యాఖ్యానించారు. ఈ కాంగ్రెస్ హయాంలో మిషన్ భగీరథను నిర్లక్ష్యంగా వదిలేశారని ఆగ్రహించారు.

### వెయ్యి జన్మలెత్తినా తాను చావను..

తాను చావాలి అంటూ ఇప్పుడు కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని కేసీఆర్ దుయ్యబట్టారు. తనను విమర్శించే వారు వెయ్యి జన్మలెత్తినా తాను చావనని తెలిపారు. పిల్లి శాపాలకు చస్తామా..? అని ఎద్దేవా చేశారు. తాను చావాలంటూ కాంగ్రెస్ నేతలు శాపాలు పెడితే తాను చస్తానా..? అని ప్రశ్నించారు. చివరి శ్వాస ఉన్నంతవరకు తాను తెలంగాణ అభివృద్ధి కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు. ఇప్పుడు తెలంగాణలో సరిగా కరెంట్ వస్తోందా..? అని ప్రశ్నించారు. పంటపొలాలు ఎండిపోయి ప్రజలు ఏడుస్తున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఓట్లు వేసేటప్పుడు.. ఆలోచించి ఓట్లు వేయాలని ఆనాడే తాను చెప్పానని ప్రస్తావించారు. వీళ్లు రైతుబంధుకు రాంరాం.. దళితబంధుకు జైభీమ్ అంటారని తాను చెప్పానని అన్నారు. ఒక్కసారే వేయాల్సిన రైతుబంధును ఒక్కో ఎకరానికి ఒక్కోసారి ఇస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో తాము ఒకేసారి రైతుబంధు వేసేవాళ్లమని చెప్పుకొచ్చా రు. కాంగ్రెస్ నేతలు ఎన్నికల ముందు నోటికొచ్చిన మాటలు.. ఇష్టమొచ్చిన కథలు చెప్పారని విమర్శించారు. వీళ్ల మాటలు నమ్మి ప్రజలు మోసపోయారని.. ఇప్పుడు గోస పడుతున్నారని చెప్పారు. 1.7 శాతం ఓట్ల తేడాతోనే మనం ఓడిపోయామని ప్రస్తావించారు. బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు అధికార పార్టీలోకి వెళ్లినా తాను ఎక్కడా మాట్లాడలేదని అన్నారు. తాము రూ.73 వేల కోట్ల రైతుబంధు ఇచ్చామని స్పష్టం చేశారు.

### నేను సభ పెడితేనే రైతుబంధు ఇస్తారా..?

తమ హయాంలో ఎకరం రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు ధర ఉండేదని కేసీఆర్ ప్రస్తావించారు. ఇప్పుడు అమ్మేవాళ్లు ఉన్నారు కానీ.. కొనేవాళ్లే లేరని చెప్పారు. ఈ కాంగ్రెస్ సర్కార్‌కు యూరియా బస్తాలు కూడా ఇవ్వడం చేతకావడం లేదని మండిపడ్డారు. యాప్‌ల పేరుతో కాళ్లకు వాపులు తప్ప ఏమీ లేదని విమర్శించారు. జగిత్యాలలో తాను సభ పెడితేనే.. రెండోవిడత రైతుబంధు ఇస్తున్నారని తెలిపారు. మళ్లీ తాను సభ పెడితేనే మూడోవిడత రైతుబంధు ఇస్తారా..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నివర్గాల జీవితాలు ఆగమయ్యాయని చెప్పారు. ఈ ప్రభుత్వంలో అంతా దోపిడీ, గూండాగిరి, అరాచకాలేనని ఆరోపించారు. అసలు తెలంగాణలో ఏం జరుగుతోందని ప్రశ్నించారు. ప్రజలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ పున: నిర్మాణం జరగాలని సూచించారు. ఈ కాంగ్రెస్ సర్కార్‌ను పోరాటం చేసి నిలదీయాల్సిందేనని హెచ్చరించారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టులను నిర్లక్ష్యంగా వదిలేశారని ధ్వజమెత్తారు. తెలంగాణ పున: నిర్మాణ యజ్ఞం ప్రారంభం కావాలని సూచించారు. జగిత్యాల నుంచే జైత్రయాత్ర మొదలవ్వాలని.. కాంగ్రెస్ పోవాలి.. బీఆర్ఎస్ రావాలని కేసీఆర్ పిలుపునిచ్చారు.

### హైడ్రా రద్దుపైనే నా తొలి సంతకం..

హైదరాబాద్‌లో హైడ్రాను తీసుకొచ్చారని.. నిజామాబాద్‌లోనూ తెస్తామని అంటున్నారని ప్రస్తావించారు. పేదల ఇళ్లను కూల్చివేయడమేనా..? ఈ ప్రభుత్వ పని అని నిలదీశారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైడ్రాను రద్దు చేస్తామని అన్నారు. హైడ్రా రద్దుపైనే తన తొలి సంతకం ఉంటుందని స్పష్టం చేశారు. మూసీ కోసం వేల ఇళ్లు కూల్చేస్తారా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేసేది రియల్ ఎస్టేట్ వ్యాపారమేనని ఆరోపించారు. మూసీ సుందరీకరణ చేయొద్దని తాను అనడం లేదని.. కానీ పేదల ఇళ్లు కూల్చివేయడం ఎందుకని..? నిలదీశారు. రైతులకు నష్టమనే మీటర్లు పెట్టడానికి తాను ఒప్పుకోలేదని అన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఢిల్లీకి మోకరిల్లి మీటర్లు పెడుతోందని.. మీటర్ల ఏర్పాటుపై తాను యుద్ధం చేస్తానని కేసీఆర్ హెచ్చరించారు.






# 23న కేబినెట్ సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సోమవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో అన్ని శాఖల ముఖ్యకార్యదర్శులను ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 99 రోజుల 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం కొనసాగుతోంది. జూన్ 12న ముగియనున్న ఈ కార్యక్రమంలో భాగంగా జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం పలు నిర్ణయాలను ప్రకటించనుంది. జూన్ 2న 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం'ను ప్రారంభించే అవకాశాలున్నాయి. ఈసారి బడ్జెట్‌లో ఈ పథకాన్ని ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టింది. దీనికి రూ.4 వేల కోట్లను కూడా కేటాయించింది. రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున జీవిత బీమా సౌకర్యాన్ని వర్తింపజేయాలని నిర్ణయించింది. ఈ పథకం ప్రారంభ సాధ్యాసాధ్యాలను క్యాబినెట్‌లో పరిశీలించనున్నారు.

మే నెలలో మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఓటర్ల తుది జాబితాను ఖరారు చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఎన్నికల సన్నద్ధతపై చర్చించే అవకాశాలున్నాయి.

గవర్నర్ కోటా కింద ప్రభుత్వం ఎమ్మెల్సీలుగా ప్రతిపాదించిన కోదండరాం, అజారుద్దీన్‌లపై గవర్నర్ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సీఎం రేవంత్‌రెడ్డి.. గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను కలిసి ప్రతిపాదనలను ఆమోదించాలని కోరారు. ఈ అంశం చర్చకు రావొచ్చు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న అంశం కూడా క్యాబినెట్‌లో చర్చకు వచ్చే అవకాశముంది. ఇప్పటికే ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ఈ నెల 22 నుంచి సమ్మెకు దిగుతామని ప్రకటించింది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, పీఆర్సీ, డీఏలను ప్రకటించడం వంటి అంశాలను జేఏసీ లేవనెత్తుతోంది. ఈ సమస్యలపై క్యాబినెట్ చర్చించవచ్చని సమాచారం.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వానికి కొంత ఇబ్బందికరంగా మారాయి. పీఆర్సీ నివేదికను తెప్పించుకుని, ఫిట్‌మెంట్‌ను ప్రకటించాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలంటూ ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేపట్టాయి. ఇప్పటికే ప్రభుత్వం ఉద్యోగుల బిల్లుల క్లియరెన్స్‌కు ప్రతి నెలా రూ.700 కోట్ల చొప్పున నిధులు విడుదల చేస్తోంది. అయినా.. రిటైర్ అయిన ఉద్యోగులకు పూర్తి స్థాయి ప్రయోజనాలు అందడం లేదని సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఉద్యోగుల సమస్యలపై క్యాబినెట్ సమావేశంలో చర్చ జరుగుతుందని సంఘాల నేతలు చెబుతున్నారు.

యాసంగి ధాన్యం సేకరణపై క్యాబినెట్ దృష్టి సారించనుంది. ధాన్యం, మొక్కజొన్నల సేకరణ ఎంత జరిగింది, ఇంకా రైతుల వద్ద ఎంత మేర ఉందన్న వివరాలను క్యాబినెట్ ఆరా తీయనుంది.

వడగళ్ల వానతో జరిగిన పంట నష్టాలపై క్యాబినెట్ చర్చించనుంది. నిజామాబాద్ వంటి జిల్లాల్లో వడగళ్ల వాన కురిసి చేతికొచ్చిన వరి ధాన్యాన్ని రైతులు నష్టపోయారు. కళ్లాలు, రహదారులపై ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది.

రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన కుల సర్వే వివరాలను ప్రభుత్వం బయటపెట్టింది. కులాలవారీగా జనాభా, ఆయా కులాల చేతుల్లో ఉన్న భూమి, పేదరికం వంటి వివరాలను బహిర్గతం చేసింది. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌పై క్యాబినెట్ చర్చించనుంది.

మెట్రో రైలు మొదటి దశ ప్రాజెక్టును ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకోవడం, నిధుల చెల్లింపు అంశంతోపాటు కొత్తగా తీసుకురానున్న రోహిత్ వేముల వివక్ష నిరోధక చట్టంపై చర్చించే అవకాశాలున్నాయి.

## జపాన్‌లో భారీ భూకంపం

టోక్యో: జపాన్‌లో ఇవాళ శక్తివంతమైన భూకంపం నమోదు అయ్యింది. రిక్టర్ స్కేల్‌పై దాని తీవ్రత 7.4గా ఉంది. దీంతో జపాన్ వాతావరణ శాఖ సునామీ వార్నింగ్ జారీ చేసింది. సుమారు మూడు మీటర్ల ఎత్తుతో సముద్ర అలలు ఎగిసిపడే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నది. ఉత్తరంలోని ఇవాటే రాష్ట్ర సమీప జలాల్లో భూకంప కేంద్రం ఉన్నట్లు భావిస్తున్నారు. చాలా శక్తివంతంగా భూమి కంపించడంతో.. వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న టోక్యోలో కూడా బిల్డింగ్‌లు షేక్ అయినట్లు తెలుస్తోంది. ఉత్తర తీరానికి సునామీ అలలు చేరుకునే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ ఏజెన్సీ పేర్కొన్నది. కోస్టల్ ప్రాంతాలను నుంచి తరలివెళ్లాలని ఆదేశాలు జారీ చేశారు. సునామీ అలల వల్ల డ్యామేజ్ జరిగే ప్రమాదం ఉన్నట్లు చెప్పారు. హెచ్చరికను వెనక్కి తీసుకునే వరకు ఎవరూ తీరానికి వెళ్లకూడదని ప్రభుత్వం పేర్కొన్నది. క్రైసిస్ మేనేజ్మెంట్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రధాని కార్యాలయం వెల్లడించింది.

## వీధి కుక్కల దాడిలో చిన్నారి మృతి

సుల్తానాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 20:

ఇటుక బట్టీ వద్ద ఆడుకుంటున్న ఓ చిన్నారిపై వీధికుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందింది. ఈ దారుణ ఘటన పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఒడిశా రాష్ట్రానికి చెందిన బాబుర్ బెహార, సరస్వతి దంపతులు.. కాట్నపల్లిలో ఉన్న ఇటుక పరిశ్రమలో పనిచేసేందుకు ఏడాది క్రితం ఇక్కడకు వచ్చారు. వీరికి ముగ్గురు పిల్లలు కాగా, రెండో కూతురు దివ్య(3) బట్టీ వద్ద ఉన్న కార్మికుల నివాస ప్రాంతాల సమీపంలో ఆడుకుంటోంది. ఆ సమయంలో కుక్కలు ఒక్కసారిగా బాలికపై దాడి చేశాయి. వాటి నుంచి తప్పించుకునేందుకు ఆ చిన్నారి సమీప పొలాల్లోకి పరుగులు తీసినా వదల్లేదు. విచక్షణా రహితంగా దాడి చేయడంతో చిన్నారి తీవ్ర గాయాలపాలైంది. అయితే, బాలిక కనిపించక పోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు సమీప ప్రాంతాల్లో గాలించారు. చివరకు పొలాల్లో తీవ్ర రక్తస్రావంతో పడి ఉన్న చిన్నారిని గుర్తించి వెంటనే సుల్తానాబాద్ ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆమె శరీరంపై దాదాపు 300కు పైగా గాయాలున్నట్లు గుర్తించారు. చిన్నారి తల్లి బాలింత కావడంతో ఇంటికే పరిమితం అవడం, బట్టీ వద్ద కూడా కార్మికులు లేకపోవడంతో కుక్కల దాడిని ఎవరూ గమనించలేక పోయారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ సమ్మె

(మొదటి పేజీ తరువాయి)

కార్మిక సంఘాలు సిద్ధమయ్యాయి. ఆర్టీసీ జేఏసీలో లేని ఇతర కార్మిక సంఘాలు సైతం సమస్యల పరిష్కారం కోరుతూ సమ్మెకు మద్దతు ఇచ్చాయి. దీంతో ఆర్టీసీలో ఉన్న అన్ని సంఘాలు సమ్మెలో పాల్గొంటున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో సోమవారం ఉదయం ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి, ఇతర ఉన్నతాధికారులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సమ్మె నేపథ్యంలో అనుసరించాల్సిన విధానాలపై చర్చించినట్లు తెలిసింది. ''ఇది మరో సకల జనుల సమ్మెగా కార్యరూపం దాల్చుతుంది. సమ్మెకు అందరి సహకారం సంపూర్ణంగా ఉంది. ప్రైవేటు సిబ్బందితో సమ్మెను నిర్వీర్యం చేయాలని ప్రభుత్వం, యాజమాన్యం భావిస్తే... ఎలా అడ్డుకోవాలో మాకు తెలుసు. సమ్మెను విజయవంతం చేసి సమస్యలను పరిష్కరించుకుంటాం'' అని ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ ఈదురు వెంకన్న తెలిపారు. సమస్యలపై మంగళవారం మధ్యాహ్నంలోగా ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం స్పందించకపోతే.. మెజార్టీ యూనియన్ల జేఏసీగా తాము సమ్మెకు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక, ప్రధాన కార్యదర్శి అశ్వత్థామ రెడ్డి తెలిపారు.

## అవమానించారని తమ్ముడు, మరదలి దారుణ హత్య

చార్మినార్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 20:

తీసుకున్న అప్పు చెల్లించక పోగా.. పిల్లల్లేరని, సంసారానికి పనికి రావని వ్యాఖ్యానించిన తమ్ముడి దంపతులపై కోపంతో మృగంలా మారి వారిని కత్తితో పొడిచి దారుణ హత్య చేసిన ఘటన హైదరాబాద్‌లోని మీర్‌చౌక్ పోల్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. మృతురాలు నాలుగు నెలల గర్భవతి కావడం గమనార్హం. మృతుల బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదిల్‌ఖాన్, ఆఖిల్‌ఖాన్ అన్నదమ్ములు. అఖిల్‌ఖాన్, అజ్మీరా బేగం దంపతులకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లున్నారు. సంతానం లేని ఆదిల్‌ఖాన్ వద్ద ఆఖిల్‌ఖాన్ తన అవసరాలకు డబ్బు తీసుకుని ఇస్తుండే వాడు. కానీ నాలుగు నెలల క్రితం తీసుకున్న డబ్బు ఇవ్వడంలో జాప్యం కావడంతో ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. డబ్బు విషయంలో గొడవ జరిగినప్పుడల్లా ఆదిల్‌ఖాన్‌ను సంసారానికి పనికి రావంటూ ఆఖిల్‌ఖాన్, అజ్మీరా బేగం అవమానించే వారు. దీంతో తమ్ముడిని, మరదల్ని అంతం చేసేందుకు ఆదిల్‌ఖాన్ పథకం వేశాడు. సోమవారం సాయంత్రం ఉస్మాన్‌పురా నూర్‌ఖాన్ బజార్‌లోని తమ్ముడింటికి వచ్చి డబ్బులడగడంతో మాటా మాటా పెరిగింది. ఆదిల్‌ఖాన్ తనతో తెచ్చుకున్న కత్తితో ఆఖిల్‌ఖాన్‌పైనా, అడ్డు వచ్చిన మరదలు అజ్మీరా బేగంపైనా విచక్షణారహితంగా దాడి చేసి పరారయ్యాడు. తీవ్ర గాయాలతో ఆఖిల్‌ఖాన్ దంపతులు ఘటనా స్థలంలోనే మరణించారు. హంతకుడ్ని త్వరలోనే పట్టుకుంటామని శంషాబాద్ డీసీపీ రాజేశ్ తెలిపారు. ఈ ఘటనతో తల్లిదండ్రులను కోల్పోయిన నలుగురు పిల్లలు అనాథలయ్యారు.

## జమ్మూకశ్మీర్‌లో ఘోర ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న వారు గాయాలపాలైనట్టు అధికారులు తెలిపారు. రామ్‌నగర్ ప్రాంతంలో కొండపై ఉన్న కగోర్ట్ గ్రామానికి సమీపంలో ఉదయం దాదాపు 10 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మలుపు వద్ద బస్సుపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వల్ల ఈ దుర్ఘటన జరిగినట్టు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే ఆ కొండ మార్గం గుండా వెళ్తున్న ఆర్మీ కాన్వాయ్ సహాయక చర్యలకు ఉపక్రమించింది. బస్సు దాదాపు 100 మీటర్ల పైనుంచి పడిపోవడం వల్ల నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సంతాపం ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50వేల చొప్పున పరిహారాన్ని ప్రధాని ప్రకటించారు. ఈ ప్రమాదం హృదయ విదారకమని, మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి అన్ని విధాలా సహాయాన్ని అందిస్తామని జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా హామీ ఇచ్చారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, తీవ్రంగా గాయపడిన వారికి రూ.లక్ష చొప్పున, స్వల్పంగా గాయాలైన వారికి రూ.50 వేల చొప్పున పరిహారాన్ని సీఎం ప్రకటించారు.



# ఘనంగా మే డే గోడపత్రిక ఆవిష్కరణ

**- మే 1న 141వ కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలి**

**- రంగారెడ్డి జిల్లా ఏఐటీయుసి కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి**

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 20 ( వార్త వేదిక సూర్య ) :
రాజేంద్రనగర్ మండల కేంద్రంలోని అత్తాపూర్ పరిధిలో సోమవారం 141వ మే డే వేడుకల సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మే డేను విజయవంతం చేయాలని కోరుతూ రూపొందించిన గోడపత్రికను కార్మికులతో కలిసి నాయకులు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రంగారెడ్డి జిల్లా ఏఐటీయుసి కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల కోసం జరిగే పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మే 1న నిర్వహించే 141వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవ వేడుకలను మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని, కార్మిక జెండాను రెపరెపలాడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసి మండల అధ్యక్షులు సాయిలు, ఉపాధ్యక్షులు రాజు, ఎస్ఎఫ్ఏల సంఘం మండల అధ్యక్షులు చందు పాల్గొన్నారు. వీరితో పాటు నాయకులు వినయ్, చంద్రమోహన్, కృష్ణ, రాజు, ఎల్లప్ప, జగదీష్, శంకర్ మరియు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రాజేంద్రనగర్ డిపో ముందు ఆర్టీసీ కార్మికుల నిరసన: 'డిమాండ్ డే'గా పాటింపు

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 20 ( వార్త వేదిక సూర్య ) :



స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం రాజేంద్రనగర్ బస్ డిపో ముందు కార్మికులు భారీ ఎత్తున 'డిమాండ్ డే' నిర్వహించారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ కార్మికులు డిమాండ్లతో కూడిన బ్యాడ్జీలను ధరించి విధుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిపో ఆవరణలో జరిగిన నిరసనలో ఎస్.డబ్ల్యూ.ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. కృష్ణ, డిపో కమిటీ కార్యదర్శి వడ్డే చంద్రయ్య పాల్గొని మాట్లాడారు. సమ్మె చేయడం కార్మికుల రాజ్యాంగబద్ధమైన హక్కు అని, దాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తోందని వారు విమర్శించారు. సమ్మెకు వెళ్లకుండా అధికారులు కౌన్సిలింగ్ పేరుతో కార్మికులను భయభ్రాంతులకు గురిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆర్టీసీ కార్మిక సంఘాలతో ప్రభుత్వం తక్షణమే చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ బస్సుల పేరుతో స్థానిక కార్మికులను బలవంతంగా ఇతర రీజియన్లకు పంపే చర్యలను వెంటనే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. సంస్థ లాభాల కోసం పనిచేస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం సానుకూల వైఖరిని ప్రదర్శించాలని, ఆర్టీసీలో యూనియన్లపై ఉన్న ఆంక్షలను ఎత్తివేసి, పెండింగ్‌లో ఉన్న వేతన సవరణలను (పి ఆర్ సి ) తక్షణమే అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం మొండి వైఖరి వీడి కార్మికుల డిమాండ్లపై చర్చలు జరపకపోతే సమ్మె అనివార్యమవుతుందని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిపో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

# కిస్మత్‌పూర్‌లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక..

**ప్రభుత్వ పథకాలపై మహిళలకు అవగాహన**

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 20 ( వార్త వేదిక సూర్య ) :




రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కిస్మత్‌పూర్ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం 99 డేస్ ఆఫ్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కింద అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యకలాపాలు మరియు ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సమావేశానికి మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ, మరియు బీసీ కార్పొరేషన్ల అధికారులు హాజర య్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని, అర్హులైన ప్రతి ఒక్కరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రధానంగా వివరించిన పథకాలు ఇందిరా మహిళా శక్తి.మహిళా సంఘాల బలోపేతం, ఆర్థిక చేయూత. గృహజ్యోతి.ఉచిత విద్యుత్ పథకం ద్వారా పేద కుటుంబాలకు లబ్ధి. గృహలక్ష్మి.ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం.మహాలక్ష్మి పథకం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంపై అవగాహన కల్పించారు. పథకాల అమలులో క్షేత్రస్థాయిలో కీలక పాత్ర పోషిస్తున్న యూ సి డి సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక మహిళా సంఘాల ప్రతినిధులతో కలిసి పథకాలను ప్రతి ఇంటికి ఎలా చేరవేయాలనే అంశంపై చర్చించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, ప్రభుత్వానికి చేరవేసేందుకు ఇలాంటి కార్యాచరణ ప్రణాళికలు ఎంతగానో దోహదప డతాయని అధికారులు స్పష్టం చేశారు.

# ఘనంగా నారా చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు





చౌటుప్పల్ ఏప్రిల్ 20 వార్తా వేదిక సూర్య



చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో నారా చంద్రబాబునాయుడు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి 76వ జన్మదిన సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బడుగు లక్ష్మయ్య మునుగోడు నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ చౌటుప్పల మండల అధ్యక్షులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీ నాయకునిగా ఎన్టీఆర్ నాయకత్వంలో పనిచేస్తూ ఎన్టీఆర్ అడుగుజాడల్లో పార్టీని బలపేతం చేసే సోమవారం భారతదేశ చరిత్రలో నిలిచిన మహోన్నత వ్యక్తి ఆ మహా నాయకుని జన్మదిన సందర్భంగా వారు భారత దేశ రాజకీయాల్లో ప్రథమ భూమిక పోషిస్తున్నటువంటి నాయకుడు విజనరీ కలిగిన మహా మనిషి రాబోవు తరాలకు భవిష్యత్తు ఏ విధంగా ఉండాలని ముందుగానే ఒక నిర్ణయాత్మకమైనటువంటి ముందు చూపుతో చేస్తున్నటువంటి కార్యక్రమాలకు భారతదేశంలోని అందరి నాయకులలో ముఖ్య నాయకునిగా పేరు తెచ్చుకున్నటువంటి చంద్రబాబు నాయుడు వారి నాయకత్వంలో తెలుగు రాష్ట్రాలలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసి దేశ రాజకీయాల్లో తనదంటూ పట్టును సాధిస్తూ ముందుకు వెళ్లాలని వీరికి భగవంతుడు ఆయురారోగ్యాలు ఉంచాలని చౌటుప్పల మండల శాఖ చౌటుప్పల మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల ద్వారా వారికి మంచి జరగాలని కోరుచున్నాము చౌటుప్పల్ మున్సిపల్ కమిటీ అధ్యక్షులు సుంకరి జంగయ్య గౌడ్ చౌటుప్పల మండల ప్రధాన కార్యదర్శి వర్కాల వెంకటేష్ గౌడ్ తెలుగుదేశం పార్టీ మండల శాఖ మున్సిపల్ శాఖ చౌటుప్పల్ ఈ కార్యక్రమంలో పాల్గొనిన తెలుగుదేశం పార్టీ నాయకులు నల్ల పర్వతాలు యాదవ్ గుమ్మడిఅంజిరెడ్డి ఆరగొని అశోక్ గౌడ్ పాశం రఘుపతి యాట వెంకటేశం తడక కోటేష్ గోషిక పాండు అశోక్ గౌడ్ గోవిందా చారి కలమ్మ ఆకుల శంకరయ్య అంజిరెడ్డి సింగిరెడ్డి సురేందర్ రెడ్డి గుర్రం యాదగిరి అంతటి కిష్టయ్య చౌటుప్పల తెలుగు యువత అధ్యక్షులు బోదుల గణేష్ సాయి లక్కారం వెంకటేశం సంజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి





## కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో అవగాహన సదస్సు

**హాజరైన డిప్యూటీ కమిషనర్ మల్లయ్య మరియు ఎం.ఆర్.ఓ రాములు**

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 20 ( వార్త వేదిక సూర్య ) :
ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించే సదస్సు సోమవారం కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఘనంగా నిర్వహించబడింది. యు.సి.డి జిహెచ్ఎంసి అత్తాపూర్ డిప్యూటీ కమిషనర్ మల్లయ్య సారథ్యంలో జరిగిన ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు పాల్గొని మహిళలకు దిశానిర్దేశం చేశారు. ఎం.ఆర్.ఓ బొమ్మ రాములు. హాజరై ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ చేరాలన్నదే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని అన్నారు. రెవెన్యూ రంగానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాల పొందడంలో గానీ, ఇతర ప్రభుత్వ సేవలను వినియోగించుకోవడంలో గానీ మహిళలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. క్షేత్రస్థాయిలో మహిళా సంఘాల సభ్యులు చురుగ్గా ఉంటేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చేలా అధికారులు కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. డిప్యూటీ కమిషనర్ మల్లయ్య పర్యవేక్షణలో జరిగిన ఈ సదస్సులో రెవెన్యూ, ఐ.సి.డి.ఎస్, హెల్త్, బ్యాంకింగ్, బీసీ, ఎస్టీ, ట్రైబల్ మరియు మైనారిటీ శాఖల అధికారులు తమ తమ విభాగాల్లోని పథకాలను క్షుణ్ణంగా వివరించారు. ముఖ్యంగా లోన్ సౌకర్యాలు, ఆరోగ్య రక్షణ చర్యలు మరియు సంక్షేమ నిధుల వినియోగంపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐ.సి.డి.ఎస్ ప్రతినిధి కవిత, డి.వై.డి.హెచ్.ఎం.ఓ పూనమ్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి రాములు, ప్రాజెక్ట్ అధికారి కరుణాకర్, సి.ఓ లు, ఆర్.పీ లు మరియు పెద్ద సంఖ్యలో మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# బుద్వేల్ వీధుల్లో కాషాయ రెపరెపలు: హిందూ సమ్మేళనం దిగ్విజయం!



మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 20 ( వార్త వేదిక సూర్య ) :
రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని బుద్వేల్ గ్రామం ఆదివారం భక్తిభావంతో పులకించిపోయింది. హిందూ ధర్మ పరిరక్షణే ధ్యేయంగా నిర్వహించిన 'హిందూ సమ్మేళనం' అత్యంత అట్టహాసంగా, వేలాది మంది జనసందోహం మధ్య వైభవంగా జరిగింది. గ్రామంలోని ప్రధాన కూడళ్లు, వీధులన్నీ కాషాయ తోరణాలు, జెండాలతో అలంకరించబడి పండుగ వాతావ రణాన్ని తలపించాయి. కార్యక్రమానికి ముందుగా ముఖ్య అతిథులు, స్వామీ జీలు స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదికపై జ్యోతి ప్రజ్వలన చేసి సమ్మేళనాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, భక్తి సంకీర్తనలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి.సభను ఉద్దేశించి మాణికేశ మహాప్రస్థానం ధర్మార్చెడ్ కు చెందిన శ్రీశ్రీశ్రీ శంకర్ స్వామీజీ ప్రసంగిస్తూ.. ప్రపంచంలో ఎన్ని మతాలు మారినా, ఎన్ని దాడులు జరిగినా చెక్కుచెదరని ఏకైక ధర్మం సనాతన ధర్మమని కొనియాడారు. భారతదేశాన్ని మళ్లీ విశ్వగురువుగా నిలబెట్టే శక్తి మన సంస్కృతికి ఉంది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వంటి సంస్థలు ఈ లక్ష్యంతోనే నిరంతరం పనిచేస్తున్నాయి. మనమంతా భరతమాత బిడ్డలమని చాటిచెప్పడమే ఈ సమ్మేళనం ఉద్దేశ్యం అని ఆయన అన్నారు. తెలంగాణ సాధు పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు రాజుశర్మ మాట్లాడుతూ.. ధర్మం కోసం ప్రాణత్యాగం చేసిన మహానుభావుల చరిత్రను గుర్తుచేశారు. నేడు మన చిన్నారులకు పాశ్చాత్య సంస్కృతిని నేర్పిస్తూ మన మూలాలను దూరం చేస్తున్నాం. 'రింగా రింగా రోజెస్' వంటి పాటల వెనుక ఉన్న విషాద చరిత్రను తెలుసుకోవాలి. కుల మతాలకతీతంగా హిందువులందరూ ఒకే తాటిపైకి వచ్చినప్పుడే మన సంస్కృతికి



రక్షణ ఉంటుంది అని పిలుపునిచ్చారు. చండీ ఉపాసకులు డా. వేద ప్రకాశ్ మాట్లాడుతూ.. అయోధ్య రామమందిర నిర్మాణం మన ఐక్యతకు నిదర్శనమని, అదే స్ఫూర్తితో కాశీ, మధుర క్షేత్రాల పునరుద్ధరణకు సంకల్పించాలని కోరారు. మహిళా వక్త ప్రసన్న లక్ష్మీ ధర్మ ప్రచారంలో మహిళల పాత్రను వివరించారు. ఈ సమ్మేళనానికి బుద్వేల్ తో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి యువత, మహిళలు, పెద్దలు భారీగా తరలివచ్చారు. నిర్వాహకులు మాట్లాడుతూ.. హిందూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సోదర భావాన్ని పెంపొందిస్తాయని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వివిధ హిందూ సంఘాల ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అధికారుల నిర్లక్ష్యం

**ఖాళీ కుర్చీకి వినతిపత్రం అందజేత**

**- పీరం చెరువులో తీవ్ర నీటి ఎద్దడి;**


**స్పందించని జలమండలి మేనేజర్**

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 20 ( వార్త వేదిక సూర్య )
జలమండలి అధికారుల నిర్లక్ష్యం పరాకాష్టకు చేరింది. ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతుంటే, కనీసం ఫిర్యాదులు స్వీకరించేందుకు కూడా అధికారులు అందుబాటులో ఉండకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం జలమండలి కార్యాలయానికి వెళ్లిన బాధితులు, మేనేజర్ సీటులో లేకపోవడంతో తమ వినతిపత్రాన్ని ఖాళీ కుర్చీకి సమర్పించి వినూత్న రీతిలో నిరసన తెలిపారు.

పీరం చెరువు, బారియాగూడ, గండంగూడ, హైదర్ షాహ్‌కోట ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఈ సమస్యపై వివరణ కోరేందుకు జలమండలి మేనేజర్ నరేష్ కి గత నాలుగు రోజులుగా ఫోన్ చేస్తున్నప్పటికీ ఆయన నుంచి ఎలాంటి స్పందన లేదని బాధితులు వాపోతున్నారు. తీవ్రమైన ఎండల రీత్యా నీటి అవసరం పెరిగిన తరుణంలో, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు కార్యాలయాలకు రాకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మేము నీళ్లు లేక ఇబ్బంది పడుతుంటే, అధికారులు కనీసం సమస్యను వినే స్థితిలో కూడా లేరు అని స్థానిక నివాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతాల్లో నెలకొన్న నీటి సమస్యను అత్యవసరంగా పరిగణించి వెంటనే చర్యలు తీసుకోవాలని, అలాగే విధులకు గైర్హాజరవుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు ఉన్నతాధికారులను డిమాండ్ చేస్తున్నారు.

# సంచిత్ గంగ్వార్ ను కలిసిన మాజీ కార్పొరేటర్ - కొంతం దీపిక నరేష్


సికింద్రాబాద్, ఏప్రిల్ 20(వార్త వేదిక సూర్య)



మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ను సోమవారం మోండా మార్కెట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పెండింగ్ పనుల పై చర్చించారు. అదేవిధంగా యుబిడి డిడి శ్రీధర్ ను కలిసి పెండింగ్ పార్క్ పనులు, హార్టికల్చర్ సమస్యల పై చర్చించారు. దినికి సంబంధించిన అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు ఉన్నారు

# శ్రీ బంగారు మైసమ్మ అమ్మవారి 10వ వార్షికోత్సవంలో పాల్గొన్నమాజీ కార్పొరేటర్ - కంది శైలజ శ్రీకాంత్

సికింద్రాబాద్, ఏప్రిల్ 20(వార్త వేదిక సూర్య)



మధురనగర్ కాలనీ, పార్సీగుట్ట లో సోమవారం ఘనంగా శ్రీ బంగారు మైసమ్మ అమ్మవారి 10వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ కంది శైలజ శ్రీకాంత్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు. అనంతరం తీర్థా ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆ యొక్క మైసమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ రాష్ట్ర ప్రజలందరికి ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పవన్ గౌడ్, ఆంజనేయులు, శైలెందర్ తదితరులు పాల్గొన్నారు

# మిషన్ భగీరథ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి





**పెంచిన వేతనాలు జనవరి నుండి అమలు చేయాలి**

**సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య**

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 20 (వార్తా వేదిక సూర్య )

మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులకు రావలసిన పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం దొడ్డి కొమరయ్య భవన్లో తెలంగాణ మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నల్లగొండ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సత్తయ్య మాట్లాడుతూ.. మిషన్ భగీరథ పథకం ద్వారా నల్గొండ జిల్లాలో 690 గ్రామాలకు మంచినీరు అందిస్తున్న కార్మికుల కు అతి తక్కువ 10 వేల నుండి 12000 మాత్రమే వేతనాలు ఇస్తున్నారని అవి కూడా నెల నెల ఇవ్వకుండా ఆరు నెలలకు ఒకసారి ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెల 5 వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధికారి సమక్షం లో కాంట్రాక్టుల తో జరిగిన ఒప్పందం ప్రకారం పెంచిన వేతనాలను జనవరి నుండి అమలు చేస్తూ పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికుల ఉద్యోగ భద్రత కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించిందని ఆ కార్పొరేషన్ లో మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులను కూడా చేర్చి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని విజ్ఞప్తి చేశారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మే 1 న మిషన్ భగీరథ వాటర్ ప్లాంట్ల దగ్గర సిఐటియు జెండాలు ఎగురవేసి కార్మిక వర్గ ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. తెలంగాణ మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నల్లగొండ జిల్లా అధ్యక్షులు జంజరాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కుద్దల సైదులు, ఉపాధ్యక్షులు నేలపట్ల అశోక్, కోశాధికారి ఉయ్యాల మురళి, శంకర్, ఆంజనేయులు, పరమేష్, కృష్ణ, సైదులు తదితరులు పాల్గొన్నారు.



## మైలార్‌దేవ్‌పల్లిలో ఘనంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 20 ( వార్త వేదిక సూర్య ) :

మైలర్ దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. భావన ఋషి కాలనీలోని శ్రీ మార్కం డేయ పద్మశాలి ట్రస్ట్ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో అభిమానులు పాల్గొన్ని కేక్ కట్ చేసి ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలి పారు.అనంతరం మాట్లాడిన వారు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధికి చేస్తున్న కృషిని కొనియాడుతూ, ఆయన నాయక త్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏర్వ సత్యనా రాయణ, కాశీగారి యాదగిరి, బండ యాదగిరి, సంతు గౌడ్, ప్రేమ్ కుమార్, వెంకటరావు, ప్రభాకర్ గౌడ్, శివకుమార్, బస శ్రీను, విజయ్ కుమార్, బుచ్చయ్య గుప్త, దొంత రాజు, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

## పేదల పెళ్లిళ్లకు 'కల్యాణ' కానుక

**గండిపేట మండలంలో 104 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 20 ( వార్త వేదిక సూర్య ) :





పేద కుటుంబాల్లో ఆడబిడ్డల పెళ్లిళ్లు భారం కాకూడ దనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదలకు వరంగా మారాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ అన్నారు. సోమవారం గండిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మొత్తం 104 మంది లబ్ధిదారులకు పథకాలకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. ముఖ్యంగా మైనారిటీ మరియు నిరుపేద వర్గాల అభ్యున్నతికి ఈ పథకాలు ఎంతో దోహదపడు తున్నాయని తెలిపారు. ప్రతి అర్హుడు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. తమకు ఆర్థిక సహాయం అందినందుకు లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల ప్రజాప్రతినిధులు, రెవెన్యూ శాఖ అధికారులు, పార్టీ నాయకులు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# రాష్ట్రం లో జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుంది

**ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం**

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 20 (వార్తా వేదిక సూర్య )



హైదరాబాద్ లోని ప్రెస్ అకాడమీ కార్యాలయాన్ని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రెస్ అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్యే కి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. మీడియా ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభమని, సమాజంలో జరుగుతున్న విషయాలను ప్రజలకు చేరవేయడంలో పాత్రికేయుల సేవలు ఎంతో ముఖ్యమని కొనియాడారు. ప్రెస్ అకాడమీ ద్వారా జర్నలిస్టుల కు శిక్షణా కార్యక్రమాలు, సౌకర్యాలను మరింత విస్తరించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. అలాగే గ్రామీణ ప్రాంతాల జర్నలిస్టులకు మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

# ప్రజల సహకారంతోనే స్వచ్ఛ నల్గొండ - హరిత నల్గొండ సాధ్యం



## పారిశుధ్య పనులపై కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 20 (వార్తా వేదిక సూర్య )

రోడ్లు,భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాలు, నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మార్గదర్శకాలు మేరకు, నల్గొండ నగరాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో కూడిన ఆదర్శ నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సోమవారం ఉదయం 12 వ, 27 వ, 28 వ డివిజన్లలో పారిశుధ్య కార్యక్రమాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత శానిటరీ సూపర్వైజర్ గడ్డం శ్రీనివాస్, శానిటరీ జవాన్ కె. పరశురామ్ లతో కలిసి డివిజన్లలో జరుగుతున్న రోడ్ల స్వీపింగ్, డ్రైన్లలో సిల్ట్ తొలగింపు, డోర్ టు డోర్ చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. పరిశీలనలో భాగంగా కమిషనర్ సంబంధిత అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. డ్రైన్లలో పేరుకుపోయిన సిల్ట్, చెత్తను వెంటనే తొలగించి నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలని, ప్రతిరోజూ స్వీపింగ్ కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని, అలాగే కమర్షియల్ ఏరియాల్లో ప్రతిరోజూ విధిగా చెత్త సేకరణ జరగాలని సూచించారు.

డోర్ టు డోర్ చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా నిర్వహించి, ప్రతి ఇంటి నుండి తడి వ్యర్థాలు, పొడి వ్యర్థాలు వేర్వేరుగా సేకరించాలన్నారు. గృహస్థులు తడి-పొడి వ్యర్థాలను వేరు చేసి ఇవ్వడం ద్వారా వ్యర్థాలను శాస్త్రీయంగా ప్రాసెస్ చేసి జీరో ల్యాండ్ ఫిల్లింగ్ లక్ష్యాన్ని సాధించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రతి ఇంటి వారు తమ గృహ వ్యర్థాలను వీధుల్లో, ఖాళీ స్థలాల్లో లేదా డ్రైన్లలో వేయకుండా, తప్పనిసరిగా మున్సిపల్ శానిటేషన్ వాహనాలకే అందించాలని విజ్ఞప్తి చేశారు. "ఇంటి చెత్తను శానిటేషన్ వాహనాలకే ఇవ్వండి -- నల్గొండను పరిశుభ్రంగా ఉంచండి" అని పౌరులకు పిలుపునిచ్చారు.అలాగే శానిటరీ సూపర్వైజర్లు ప్రతిరోజూ ఫీల్డ్ మానిటరింగ్ నిర్వహించి పారిశుధ్య కార్యకలాపాలను పర్యవేక్షించాలని, ప్రజల నుండి వచ్చే పారిశుధ్య ఫిర్యాదులు, ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. దోమల నివారణ, ఫాగింగ్, యాంటీ లార్వా చర్యలు, సీజనల్ వ్యాధుల నివారణ పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఒక్కటే నగరాన్ని పరిశుభ్రంగా ఉంచలేదని, ప్రజల సహకారం లేకుండా "స్వచ్ఛ నల్గొండ -- హరిత నల్గొండ" లక్ష్యం సాధ్యం కాదని స్పష్టం చేశారు. అధికారులు, సిబ్బంది, ప్రజలు సమన్వయంతో పనిచేస్తేనే నల్గొండను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు.నల్గొండ ప్రజలు మున్సిపల్ కార్పొరేషన్‌కు సహకరించి, ఇంటి చెత్తను వాహనాలకు మాత్రమే అందించడం, చెత్త వేరు చేయడం, డ్రైన్లలో వ్యర్థాలు వేయకపోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి అంశాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కమిషనర్ కోరారు. ప్రజల భాగస్వామ్యం తో క్లీన్ అండ్ గ్రీన్ నల్గొండ సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. "స్వచ్ఛత ఒక ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదు -- అది ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత" అని కమిషనర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్వైజర్ గడ్డం శ్రీనివాస్, శానిటరీ జవాన్ కె. పరశురామ్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు. నగర పరిశుభ్రత, ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ దిశగా పారిశుధ్య కార్యక్రమాలు మరింత కట్టుదిట్టంగా అమలు చేయబడతాయని తెలిపారు.



## భక్తి మార్గమే ప్రగతికి సోపానం

**మైలర్ దేవ్ పల్లిలో వైభవంగా హిందూ సమ్మేళనం**

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 20 ( వార్త వేదిక సూర్య )




మన సంస్కృతి మన గుర్తింపు.. మన ధర్మం మన జీవన గమ్యం. ఈ సత్యాన్ని చాటిచెబుతూ మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని శ్రీ హనుమాన్ దేవాలయ ప్రాంగణం ఆధ్యాత్మిక చైతన్యంతో పులకించిపోయింది. లోక కళ్యాణార్థం, హిందూ ధర్మ రక్షణార్థం నిర్వహించిన 'హిందూ సమ్మేళనం' అశేష భక్తజన సందోహం మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ వక్తలు భక్తి మార్గం యొక్క ఆవశ్యకతను నొక్కి చెప్పారు. "ధర్మో రక్షతి రక్షితః" అన్న సూక్తిని గుర్తు చేస్తూ, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు కేవలం ఆచారాలు మాత్రమే కావని, అవి మానసిక ప్రశాంతతకు, సామాజిక సమరసతకు మూలస్తంభాలని వివరిం చారు. దేవాలయాల సంరక్షణ కేవలం బాధ్యత మాత్రమే కాదు, అది మన అస్తిత్వాన్ని కాపాడు కోవడం అని వారు ప్రబోధించారు. నేటి బాలలే రేపటి పౌరులు అన్న నానుడిని నిజం చేస్తూ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పురాణ గాథలను, భక్తి తత్వాన్ని ప్రతిబింబిస్తూ విద్యార్థులు చేసిన ప్రదర్శనలు చూస్తుంటే, భారతీయ సంస్కృతి సురక్షితమైన చేతుల్లోనే ఉందన్న భరోసా కలిగింది. వారి అభినయం, వేషధారణ సమ్మేళనానికి ప్రత్యేక ఆధ్యాత్మిక శోభను చేకూర్చాయి. భక్తికి సేవ తోడైనప్పుడే అది పరిపూర్ణ మవుతుంది. సమ్మేళనానికి విచ్చేసిన భక్తులందరికీ నిర్వాహకులు భోజన సౌకర్యం కల్పించారు. భక్తి భావంతో, క్రమశిక్షణతో సాగిన ఈ కార్యక్రమం స్థానికులలో కొత్త ఆధ్యాత్మిక ఉత్తేజాన్ని నింపింది. దేవాలయ ప్రాంగణమంతా మారుమోగిన భక్తి నినాదాలు, వక్తల హితోక్తులు ప్రతి ఒక్కరిలో ధర్మ నిష్ఠను పెంపొందించాయి. ఈ సమ్మేళనం కేవలం ఒక వేడుకలా కాకుండా, ప్రతి ఇంటా ఆధ్యాత్మిక జ్యోతిని వెలిగించేలా సాగడం విశేషం.

## ట్యాంక్ బండ్ పై ఘనంగా మహాత్మ బసవేశ్వరుని జయంతి వేడుకలు

**బసవన్న ఆశయాలు నేటికీ ఆదర్శం: మాజీ కౌన్సిలర్ ఉషారాణి**

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 20 ( వార్త వేదిక సూర్య ) :




సమాజంలోని అసమానతలను తొలగించి, సమసమాజ స్థాపనకు కృషి చేసిన 12వ శతాబ్దపు గొప్ప విప్లవకారుడు, సంఘసంస్కర్త మహాత్మ బసవేశ్వరుని 893వ జయంతి వేడుకలు ట్యాంక్ బండ్ వద్ద ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ ఉషారాణి బసవేశ్వరుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, 900 ఏళ్ల క్రితమే కుల, మత, వర్ణ వివక్షలు లేని సమాజాన్ని కలగన్న మహనీయుడు బసవేశ్వరుడని కొనియాడారు. మానవీయ విలువలే ప్రాతిపదికన ఆయన చేసిన పోరాటం మరువలేనిదని, 'అందరూ సమానమే' అన్న ఆయన సందేశం ప్రస్తుత సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఆయన అడుగుజాడల్లో నడవడమే మనం ఆయనకు ఇచ్చే అసలైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సంఘం ప్రతినిధులు, సభ్యులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయంతి వేడుకలను విజయవంతం చేశారు.

## అత్తాపూర్‌లో హత్యాయత్నం కేసు -- నిందితుడు రిమాండ్‌కు

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 20 ( వార్త వేదిక సూర్య ) :

అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్యా యత్నం కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.పోలీసుల వివరాల ప్రకారం... చింతల్‌మెట్ ప్రాంతానికి చెందిన మొహమ్మద్ మహ్మూద్ అహ్మద్ (38) అత్తాపూర్‌లోని మెట్రో ఫర్నిచర్ షాప్‌లో సోఫా తయారీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గతంలో అదే షాప్‌లో పనిచేసిన సయ్యద్ మజ్హర్ అలియాస్ మహమూద్ (40) పనిలో నిర్లక్ష్యం కారణంగా రెండు నెలల క్రితం తొలగించబడ్డాడు. అప్పటి నుంచి అతడు ఫిర్యాదు దారుని బెదిరిస్తూ వచ్చాడు.ఈ క్రమంలో 19 ఏప్రిల్ 2026న ఉదయం షాప్‌లో నిద్రిస్తున్న కార్మికుడు అజీజ్‌పై నిందితుడు బ్లేడ్‌తో దాడి చేసినట్లు సీసీటీవీ ఫుటేజ్‌లో నమోదైంది. ఈ దాడి వెనుక ఉద్యోగం కోల్పోయిన ద్వేషమే కారణమని పోలీసులు తెలిపారు.సమాచారం అందుకున్న పోలీసులు అదే రోజు సాయంత్రం అరంఘర్ క్రాస్ రోడ్ వద్ద నింది తుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచార ణలో అతడు నేరాన్ని అంగీకరించాడు. అతడి వద్ద నుంచి బ్లేడ్‌తో పాటు మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకు న్నారు.అనంతరం నిందితుడిని న్యాయస్థా నంలో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.



# పోలీస్ గ్రీవెన్స్ డే బాధితుల పిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్

నల్గొండ టౌన్ ఏప్రిల్ 20 (వార్త వేదిక సూర్య)

సోమవారం నాడు నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మొత్తం 28 మంది బాధితులు తమ సమస్యలను ఎస్పి వివరించారు.

ప్రతి పిటిషన్‌ను జాగ్రత్తగా విన్న జిల్లా ఎస్పి సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఆలస్యం చేయకుండా, చట్టపరమైన విధానాల ప్రకారం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ, ప్రజలకు న్యాయం అందించడం పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా పోలీసు అధికారులకు తెలియజేయడానికి గ్రీవెన్స్ డే ఒక మంచి వేదికగా పనిచేస్తుందని తెలిపారు. ప్రతి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అదేవిధంగా, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నమ్మకంతో పోలీసు శాఖను సంప్రదించాలని, పోలీసు అధికారులు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటారని జిల్లా ఎస్పి తెలిపారు.

# నాంపల్లి మండల కేంద్రంలో తెలంగాణా పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలి

**- మునుగోడు నియోజకవర్గానికి హాస్పిటల్స్, స్కూల్లు ఏవి వచ్చిన చండూర్, చౌటుప్పల్, మునుగోడు కేనా**

**- మా నాంపల్లి మునుగోడులో లేదా..?**

**ఎందుకు నాంపల్లి మీద ఇంత చిన్నచూపు**

**- బీజేవైఎం నాంపల్లి మండల అధ్యక్షులు నాంపల్లి సతీష్**

నాంపల్లి ఏప్రిల్20(వార్త వేదిక సూర్య)



నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం తెలంగాణా ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపట్టిన తెలంగాణా పబ్లిక్ స్కూల్ ని నాంపల్లి మండలం కేంద్రంలో ఏర్పాటు చేయాలనీ భారతీయ జనతా యువమోర్చ నాంపల్లి మండల అధ్యక్షులు నాంపల్లి సతీష్ డిమాండ్ చేశారు.ఒకటవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఒకే దగ్గర నాణ్యమైన విద్య అందడంతో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకి లబ్ధి చేకూరుతుందని అన్నారు.మునుగోడు నియోజకవర్గం మారుమూల వెనుకబడిన మండలంగా వున్నా నాంపల్లి మండల కేంద్రంలో ఈ స్కూల్ ఏర్పాటు చేసినట్లయితే బడుగు బలహీన పేద విద్యార్థుల భవిష్యత్తుకు దోహద పడుతుందని తెలిపారు.మునుగోడు నియోజకవర్గానికి స్కూల్లు, హాస్పిటల్ ఎలాంటివి మంజూరు అయినా సరే ప్రతి ఒక్కటి చండూర్, చౌటుప్పల్, మునుగోడు కే కేటాయిస్తున్నారు మా మండలానికి ఎందుకు కేటాయిస్తలేరు మునుగోడులో భాగం కదా మా నాంపల్లి మండలం ఎందుకు ఇంత వివక్ష నాంపల్లి మండలం మీద అని మండిపడ్డారు.నూతనంగా ఏంపిక అయిన ఈ తెలంగాణా పబ్లిక్ స్కూల్ ని ఆయిన మా నాంపల్లి మండలానికి కేటాయించండి అని విద్యార్థుల పక్షాన డిమాండ్ చేశారు.లేనిపక్షంలో నాంపల్లి మండల కేంద్రంగా బీజేవైఎం ఆధ్వర్యంలో విద్యార్థులతో కలసి మండల వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చెపడతామని హెచ్చరించారు

# ఘనంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు

గట్టుప్పల.ఏప్రిల్ 20.వార్త వేదిక సూర్య:

గట్టుప్పల మండల కేంద్రంలో టీడీపీ అధినేత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు అభిమానులు ఘనంగా నిర్వహించారు.పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎండి పాషా ఆధ్వర్యంలో కేకు కటింగ్ చేసి మిఠాయిలు పండ్లు పంపిణీ చేశారు .టీడీపీ హయాంలో ప్రవేశపెట్టిన పథకాలకు నేటికీ ప్రజల నుంచి ఆదరణ ఉందని నాయకులు అన్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి సర్పంచ్ నామని జగన్నాదం మండల ఉపాధ్యక్షులు పేట్టుగల అంజయ్య,చింతకయాల రాజు,పెదగని రాములు, తిమ్మయ్య ,నర్సింమ,అచ్చులు,నగేష్,గణేష్, పాల్గొన్నారు

# నీట్ ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలి

**స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై .అశోక్ రెడ్డి**

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 20 (వార్తా వేదిక సూర్య )

నీట్ ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై .అశోక్ రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మే 3 న నిర్వహించే నీట్ పరీక్ష పై అధికారులతో సమావేశం నిర్వహించారు.పరీక్ష నిర్వహణలో ఎలాంటి తప్పులు దొర్లకుండా పక్కాగా ప్రణాళికలు అమలు చేయాలని ఆదేశించారు.మే 3 న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరుగుతుందని,జిల్లాలో మొత్తం 2,318 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఎన్‌జీ కాలేజ్, ఉమెన్స్ డిగ్రీ కాలేజ్, మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధిలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.అభ్యర్థులు




పరీక్షకు ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు మాత్రమే పరీక్ష కేంద్రాలకు అనుమతి కల్పిస్తామని తెలిపారు.

అభ్యర్థుల సౌకర్యార్థం కేంద్రాల వద్ద తాగునీరు,మూత్రశాలలు (వాష్‌రూమ్స్),పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో ఏ ఎస్ పి రమేష్,నీట్ పరీక్ష జిల్లా కోఆర్డినేటర్ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, సెంటర్ సూపర్డెంట్లు, విద్యాశాఖ మున్సిపల్ కమిషనర్ వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా మ్యాపింగ్ ను వేగవంతం చేసి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలి




**జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్**

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 20 (వార్తా వేదిక సూర్య )

ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా మ్యాపింగ్‌ను వేగవంతం చేసి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ఆదేశించారు సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ జరిగిన అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం జిల్లాల్లో అర్బన్ ప్రాంతాల్లో 59 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 79 శాతం పురోగతి నమోదైందన్నారు. బీఎల్‌వోలను ఉపయోగించి డోర్ టు డోర్ సర్వే నిర్వహిస్తున్నామని, సూపర్వైజర్లు సిబ్బందితో సమన్వయం చేస్తూ పనిని పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. మున్సిపాలిటీలలో జవాన్ల సహకారం తీసుకుంటూ, కాలనీలలో అధ్యక్షుల ద్వారా ప్రజలను చైతన్యపరుస్తూ ఎస్‌ఐఆర్ పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇంకా వెనుక బడిన (వీక్) ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక ప్రణాళికలతో పని వేగవంతం చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఎస్‌ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడిన చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి, మే 9లోపు ఈ ప్రక్రియను పూర్తిచేయాలని స్పష్టం చేశారు.ఒడిశా రాష్ట్రంలో ఈ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించి 90--95 శాతం విజయవంతంగా పూర్తి చేసినట్లు పేర్కొంటూ, అదే స్థాయిలో తెలంగాణలో కూడా పూర్తి చేయాలని సూచించారు. మ్యాపింగ్ ప్రక్రియ అత్యంత కీలకమని, పోలింగ్ స్టేషన్ వారీగా బీఎల్‌వోలు, సూపర్వైజర్లు విస్తృతంగా ఫీల్డ్ విజిట్లు చేయాలని, ఆదేశించారు. మే 9 నుంచి సెన్సస్ ప్రక్రియ ప్రారంభం కానున్నం దున, ముందుగానే ఎస్‌ఐఆర్ పూర్తి చేసి తదుపరి కార్యక్రమాలకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు., ఎస్‌ఐఆర్ మ్యాపింగ్‌ను వేగవంతం చేసి నిర్ణీత గడు వులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తే లక్ష్యం సాధ్యం అవుతుందని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై .అశోక్ రెడ్డి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



# బసవేశ్వరుని బోధనలు నేటి సమాజానికి మార్గదర్శకం

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 20 (వార్తా వేదిక సూర్య )

బసవేశ్వరున్ని స్ఫూర్తి గా తీసుకొని ముందుకు వెళ్లాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు ) వై .ఆశోక్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 893 వ బసవేశ్వరుడి జయంతి కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి పాల్గొని బసవేశ్వరుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. బసవేశ్వరుడు సమాజంలో సమానత్వం, న్యాయం, నీతి కోసం చేసిన సేవలు అపారమని, ఆయన బోధనలు నేటి సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆలోచనలను అనుసరించి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి సంజీవయ్య,ఏవో మోతిలాల్ , జిల్లా వీర శైవ లింగాయత్,లింగ బలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు పొగాకు నాగరాజు వరప్రసాద్,కోటి ధరమ్,శెట్టి పరమేష్. కోయిలకొండ అరుణ, లింగప్ప, వినయ్ కుమార్,నాగరాజు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి




**రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్**

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 20 (వార్తా వేదిక సూర్య )

ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం అయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో వివిధ అంశాలపై ఆయన సమీక్షిస్తూ ప్రజావాణి ద్వారా స్వీకరించిన ఫిర్యాదులు పెండింగ్లో ఉంచవద్దని, ఫిర్యాదుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని, ఎప్పటి ఫిర్యాదులు అప్పుడే పరిష్కరించాలని, దానివల్ల ఫిర్యాదుదారుకు మేలు కలుగుతుందని అన్నారు. ఈ నెల 28 న రాష్ట్ర సమాచార హక్కు (ఆర్. టి. ఐ) కమిషనర్లు జిల్లా కేంద్రానికి రానున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు.ఉదయం 10 గంటలకు పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లు (పి . ఐ.ఓ లు), అప్పీలేట్ అథారిటీ అధికారులు మరియు సంబంధిత శాఖల అధికారులకు ఆర్టీఐ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నారని,ఈ సందర్భంగా ఆర్టీఐ చట్టం అమలు విధానం, దరఖాస్తుల నిర్వహణ, సమాధానాల ప్రక్రియపై సమగ్రంగా వివరణ ఇవ్వనున్నారుని తెలిపారు. జిల్లా అధికారులు తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరుకావాలని, ముఖ్యంగా సెక్షన్ 4(1)(బి) కింద వెల్లడించాల్సిన సమాచారాన్ని ముందుగానే నవీకరించి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రస్తుత సంవత్సరంలో వచ్చిన ఆర్టీఐ దరఖాస్తుల వివరాలను నమోదు చేయాలని, లేనిపక్షంలో 'నిల్'గా నమోదు చేయాలని స్పష్టం చేశారు. మధ్యాహ్నం సమయంలో కమిషనర్లు పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించనున్నారని, కోర్టు కేసులు, విచారణలో ఉన్న అంశాలపై పూర్తి వివరాలతో ఫైళ్లు సిద్ధం చేసి పంపాలని, సంబంధిత పిటిషన్లను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు.సోమవారం నాటి ప్రజావాణి 104 ఫిర్యాదులు రాగా, రెవిన్యూశాఖకు 70,తక్కిన శాఖలకు 34 వచ్చాయి.మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై . అశోక్ రెడ్డి ,చండూరు ఆర్డీవో శ్రీదేవి, దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, జిల్లా అధికారులు హాజరయ్యారు.

# బైకు దొంగ అరెస్టు రిమాండ్

**దొంగతనాలకు పాల్పడితే కఠిన చర్యలు**

**సిఐ నవీన్ కుమార్**

దేవరకొండ,ఏప్రిల్ 20 ( వార్త వేదిక సూర్య):-



బైకు దొంగతనాలకు పాల్పడుతున్న దొంగను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు కొండమల్లేపల్లి సిఐ నవీన్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం కొండమల్లేపల్లి సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొండమల్లేపల్లి పట్టణానికి చెందిన నేనావత్ నరేష్ అనే వ్యక్తి తన బైక్ పోయిన విషయమై ఈ నెల 9న పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కేసు నమోదు చేసుకొని బైకు దొంగలను పట్టుకునే ప్రయత్నంలో కొండమల్లేపల్లి ఎస్సై అజ్మీరా రమేష్ బృందం ప్రయత్నిస్తుందన్నారు. సోమవారం ఎస్సై రమేష్ తన సిబ్బందితో సాగర్ రోడ్డులోని పెండ్లిపాకుల ఎక్స్ రోడ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ద్విచక్ర వాహనంపై ఉన్న వ్యక్తి ద్విచక్ర వాహనానికి సంబంధించిన పేపర్లు చూపించకపోవడం, తడబడడంతో అతన్ని పూర్తిస్థాయిలో విచారించారు.బైక్ దొంగతనాలకు మరో వ్యక్తితో కలిసి తానే పాల్పడినట్లు పోలీసుల ముందు ఒప్పుకున్నాడు. ఇతడు మాదగొని ముఖేష్ తండ్రి లింగస్వామిగా గుర్తించారు ప్రస్తుతం బీసీ కాలనీ నిడమానూరు గ్రామం మండలంలో నివాసం ఉంటున్నట్లు తెలిపారు.ఇతను మొత్తం నాలుగు ద్విచక్ర వాహనాలు దొంగతనానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. నార్కట్పల్లి, దేవరకొండ, కొండమల్లేపల్లి లో మరో నిందితుడితో కలిసి మొత్తం నాలుగు ద్విచక్ర వాహనాలను దొంగిలించినట్లు తెలిపారు. ఇతడి నుండి రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడని అతని వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఉన్నాయని త్వరలో పట్టుకుంటామని తెలిపారు. ద్విచక్ర వాహనాల దొంగతనం కేసును త్వరలో చేదించినందుకు సిఐ నవీన్ కుమార్ ఎస్సై అజ్మీరా రమేష్ క్రైమ్ పార్టీ పోలీసులు హేము నాయక్ భాస్కర్ హెచ్ జి శేఖర్లను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు

# ప్రజలందరూ జనగణన కార్యక్రమంలో చురుకుగా పాల్గొని ప్రభుత్వానికి సహకరించాలి

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 20 (వార్తా వేదిక సూర్య )

భారత జనగణన -- 2027 నిర్వహణకు సంబంధించి ప్రజల సహకారం కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనగణన చట్టం, 1948 మరియు జనగణన నియమాలు, 1990 ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని, జనగణన దేశంలోని గ్రామాలు మరియు పట్టణాల స్థాయిలో గృహ పరిస్థితులు, జనాభా, విద్య, మతం, ఉపాధి, వలసలు, జనన రేటు వంటి ముఖ్యమైన సమాచారాన్ని సేకరించే ప్రధాన ప్రక్రియని ఈ డేటా ప్రభుత్వ విధానాల రూపకల్పన, అభివృద్ధి కార్యక్రమాలు, నియోజకవర్గాల పునర్విభజన మరియు రిజర్వేషన్లకు ఉపయోగపడుతుందని అన్నారు. జనగణన సమయంలో అధికారులు ప్రజలను ప్రశ్నలు అడగవచ్చని, ప్రతి పౌరుడు తనకు తెలిసిన మేరకు సరైన సమాచారం ఇవ్వడం చట్టబద్ధ బాధ్యత అని, మహిళల వ్యక్తిగత వివరాల విషయంలో గౌరవం కాపాడబడుతుందని తెలిపారు. ప్రతి గృహ యజమాని జనగణన అధికారులకు సహకరించి, గృహంపై గుర్తులు లేదా సంఖ్యలు వేయడానికి అనుమతించాలని. అధికారులిచ్చే ఫారాన్ని పూర్తి చేసి, నిజమైన వివరాలతో సమర్పించాలని కోరారు. జనగణన పనిలో అంతరాయం కల్పించడం, తప్పుడు సమాచారం ఇవ్వడం, అధికారులకు ప్రవేశం నిరాకరించడం వంటి చర్యలు చట్టపరంగా శిక్షార్హం అవుతుందని ఇందుకు జరిమానా లేదా జైలు శిక్ష విధించబడుతుందని కలెక్టర్ తెలిపారు. జనగణన ద్వారా సేకరించిన వ్యక్తిగత సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందను మరియు ఎటువంటి కోర్టులో సాక్ష్యంగా ఉపయోగించబడదని, అందువల్ల ప్రజలందరూ జనగణన కార్యక్రమంలో చురుకుగా పాల్గొని ప్రభుత్వానికి సహకరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.





## నేనావత్ కుమార్ నాయక్ కుమార్తె నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్

దేవరకొండ ఏప్రిల్ 20 ( వార్తా వేదిక సూర్య ):-

గన్యానాయక్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని సీతారాం తండాకు చెందిన నేనావత్ కుమార్ కుమార్తె నిశ్చితార్థ వేడుక నేడు అత్యంత వైభవంగా జరిగింది. ఈ శుభకార్యానికి బిఆర్ఎస్ పార్టీ నాయకులు నేనావత్ కిషన్ నాయక్ ముఖ్య అతిథిగా విచ్చేసి, నూతన వధూవరులను ఆశీర్వదించారు

ఈ కార్యక్రమంలో కిషన్ నాయక్ గారితో పాటు గ్రామ సర్పంచ్ నేనావత్ గోపాల్ నాయక్, కౌన్సిలర్ అంజిగౌడ్ గారు పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

వారితో పాటు

ఈ వేడుకలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు ముదిగొండ హరిదాస్, నేనావత్ గణేష్ నాయక్, రాజు నాయక్, లక్పతి, గోపీనాయక్, తులసీరామ్, చిన్నానాయక్ మరియు ఇతర కార్యకర్తలు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## కానిస్టేబుల్ మరియు ఎస్సై లకు శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఇప్పించిన జాలే నరసింహారెడ్డి రెడ్డి తిలక్

దేవరకొండ ఏప్రిల్ 20 ( వార్త వేదిక సూర్య )





నేడు హైరాబాద్ లోని నందు ఆర్మీ ఫిజికల్ ట్రైనింగ్ అకాడమీ లో తెలుగు రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాలకు చెందిన 100 మంది కానిస్టేబుల్ మరియు ఎస్సై లకు శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఇప్పించిన నాయకులు జాలే నరసింహారెడ్డి తిలక్ రెడ్డి

అనంతరం నందు ఆర్మీ డైరెక్టర్ నందు గారు మాట్లాడుతూ.. ఈ రోజుల్లో ఏ నాయకుడైనా తమ ప్రాంతానికి చెందిన వారికైతేనే సహాయం చేస్తారు వారు అలా ఆలోచించకుండా తమ ప్రాంతం కాకున్నా కష్టం అని వారి గడప తొక్కిన ప్రతీ ఒక్కరికీ సహాయం అందిస్తూ.. దేవరకొండ నియోజకవర్గంలో వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టిన జాలే బ్రదర్స్ నరసింహారెడ్డి తిలక్ రెడ్డి గార్లకు విద్యార్థులతో కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలపడం జరిగింది

## రిలైఫ్ న్యూరో రీహాబిలిటేషన్ సెంటర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

దేవరకొండ ఏప్రిల్ 20 ( వార్త వేదిక సూర్య):-



హైదరాబాద్ లోని బిన్ రెడ్డి దగ్గర ఏర్పాటు చేసిన రిలైఫ్ న్యూరో రీహాబిలిటేషన్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సహచర ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి తో కలిసి పాల్గొని రిలైఫ్ న్యూరో రీహాబిలిటేషన్ సెంటర్‌లి ను ప్రారంభించి, హాస్పిటల్ యజమానికి శుభాకాంక్షలు తెలియజేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# రబీ ధాన్యం కొనుగోలును మరింత వేగవంతం చేసాం



కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 20 (వార్తా వేదిక సూర్య )

రబీ ధాన్యం కొనుగోలును మరింత వేగవంతం చేసినట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్ల వేగవంతం తో పాటు, రైస్ మిల్లుల వద్ద అన్లోడింగ్ కూడా వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. తనతో పాటు,అదనపు కలెక్టర్ తహసిల్దార్లు, సీనియర్ అధికారులు కొనుగోలు కేంద్రాలను, రైస్ మిల్లులను సందర్శించి ఎప్పటికప్పుడు కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీల ద్వారా రైస్ మిల్లులకు పంపించడం, రైస్ మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు ఆన్ లోడ్ చేసుకునే విధంగా ప్రత్యక్షంగా మిల్లులకు వెళ్లి పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఆయా మిల్లుల వద్ద కేటాయించిన లారీలు, ధాన్యం అన్లోడ్ చేసుకున్న లారీలు, ధాన్యాన్ని అన్లోడ్ చేసేందుకు ఆగి ఉన్న లారీల వివరాలు అన్నింటిని తాసిల్దార్లు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేస్తున్నారని, ఎక్కడ లారీలు ఆగకుండా వెంటనే అన్లోడ్ చేసే విధంగా, అలాగే కొనుగోలు కేంద్రాల నుండి కూడా ఎలాంటి జాప్యం లేకుండా ధాన్యం మిల్లులకు పంపించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వీటితోపాటు, ఆయా మిల్లుల వద్ద కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీ సమస్య లేకుండా హమాలీలతో కూడా మాట్లాడడం జరుగుతున్నదని, అన్ని కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల వద్ద ఎవ్వరు వడదెబ్బకు గురికాకుండా అవసరమైన అన్ని సౌకర్యాలను తహసిల్దార్లు పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం కొండమల్లేపల్లి తహసిల్దార్ మండలంలోని గుమ్మడవెల్లి లో ఉన్న శ్రీ లక్ష్మీ రైస్ మిల్లును, తిప్పర్తి తహసిల్దారు అని శెట్టి దుప్పలపల్లి లో ఉన్న వెంకటేశ్వర రైస్ మిల్లును, ఆమనగల్ ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని తహసిల్దారు సందర్శించి ధాన్యం కొనుగోలను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా నార్కెట్పల్లి తహసిల్దార్ బ్రాహ్మణ వెల్లేముల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారని కలెక్టర్ పేర్కొన్నారు. ఆయా మిల్లుల వద్ద ధాన్యాన్ని తీసుకువచ్చిన లారీలు, అన్లోడింగ్ చేసిన లారీలు, ఆగి ఉన్న లారీల వివరాలు, వీటిని ఎప్పటికప్పుడు తనకు నివేదిక రూపంలో అందజేస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. మండలాల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలను పర్యవేక్షించాలని, ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడ అనవసరంగా కొనుగోలు నిలిచిపోవడం, లేదా లారీలు లేకుండా లోడింగ్ కాకపోవడం, మిల్లల వద్ద లారీలు అన్లోడింగ్ కోసం ఆగి ఉండటం వంటివి జరగకూడదని ఆయన స్పష్టం చేశారు.

# మెట్లకు ట్రైనింగ్ క్యాంపు నిర్వహించి ఉపాధి హామీ చట్టం పటిష్టంగా అమలు చేయాలి



కంబాలపల్లి ఆనంద్

దేవరకొండ ఏప్రిల్ 20 ( వార్త వేదిక సూర్య):-

పీఏ పల్లి రెండుసార్లు ఫోటోలు అప్లోడ్ చేసే విధానాన్ని రద్దుచేసి మేట్లకు ట్రైనింగ్ క్యాంపు నిర్వహించి ఉపాధి హామీ చట్టం ప్రతిష్టంగా అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు పీఏ పల్లి మండల కేంద్రంలో ఎంపీడీవో కీ వినతి పత్రం అందిస్తూ ఈ సందర్భంగా కంబాలపల్లి ఆనంద్ మాట్లాడుతూ ఆన్లైన్ పేమెంట్ పేరుతో కేంద్ర ప్రభుత్వం తన ఆధీనంలో తీసుకొని కొత్త చట్టం ద్వారా కూలీలను పనికి దూరం చేయటానికి రెండు సార్లు ఫోటోలు అప్లోడ్ విధానం తీసుకువచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఉపాధి హామీ పటిష్టంగా అమలు జరగాలంటే మెట్ల వస్తున్న తీసుకొని ప్రతి సంవత్సరం ట్రైనింగ్ క్యాంపు నిర్వహించి మేట్లకు పారితోషకం ఇవ్వాలని ఫీల్డ్ అసిస్టెంట్ పర్మిట్ చేయాలని పేదలు సాగు భూముల అభివృద్ధికి పనులు చేపట్టి కేంద్ర బడ్జెట్లో కనీసం రూ 2'64 లక్షల కోట్ల కేటాయించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి కావలి కృష్ణయ్య పావురాల గట్టు వార్డ్ మెంబర్ మోతిలాల్ ఎం వెంకటేశ్వర్లు సాయిలు ఆర్ చందు రమేష్ తదితరులు పాల్గొన్నారు

# తాగునీటి సరఫరాపై ప్రత్యేక సమీక్ష



అధికారులకు మంత్రి, మేయర్ సూచనలు

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 20 (వార్తా వేదిక సూర్య )

నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వేసవి కాలంలో నిరంతరాయ తాగునీటి సరఫరా అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గౌరవ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారి మార్గదర్శకత్వంలో, మేయర్ శ్రీ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి గారి సహకారంతో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో పానగల్ పంప్ హౌస్ వద్ద నీటి సరఫరా సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అధికారులు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా ప్రజలకు నిర్ణీత సమయానికి తాగునీటి సరఫరా అందించాలనీ, ఎక్కడైనా లీకేజీలు తలెత్తిన వెంటనే స్పందించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలనీ, నీటి ట్యాంకులు, పంప్ హౌస్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనీ, నీటి సరఫరా వ్యవస్థను ఎల్లప్పుడూ సక్రమంగా నిర్వహించాలనీ ఆదేశించారు. అలాగే వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా పనిచేయాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని సూచించారు. నీటి పన్నుల వసూళ్లను కూడా క్రమబద్ధంగా నిర్వహించి మున్సిపల్ ఆదాయాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. రాములు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. అశోక్, అసిస్టెంట్ ఇంజనీర్ దిలీప్, వాటర్ సప్లై ఫిట్టర్లు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

## మేడే ను జయప్రదం చేయండి : పల్లా దేవేందర్ రెడ్డి




నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 20 (వార్తా వేదిక సూర్య )

ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే ను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నల్లగొండలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. అమెరికాలోని చికాగో నగరంలో 1886 మే 1న ప్రారంభమైన కార్మిక ఉద్యమం ప్రపంచ కార్మిక లోకానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. మేడే పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలని ఆయన కోరారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలు కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా మారుస్తూ కార్మిక హక్కులను హరించి వేస్తున్నారని ఆరోపించారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ లను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు. దేశ సంపదను సృష్టించే కార్మికుడు క్షేమంగా ఉంటేనే దేశం పురోగతి సాధిస్తుందని కానీ అలాంటి కార్మికులు కష్టాలు పెంచే విధంగా కేంద్ర ప్రభుత్వం చట్టాలు తెచ్చిందని అన్నారు. సంఘం పెట్టుకునే హక్కు , సమ్మె చేసే హక్కు వేతనాల పెంచమని పోరాడే హక్కును కాలరాసే విధంగా లేబర్ కోడ్ లు రూపొందించారని ఆరోపించారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ విధానం పేరుతో కార్మికుల శ్రమదోపిడికి పాల్పడుతున్నారని ప్రభుత్వాలు మారిన కాంట్రాక్ట్ కార్మిక జీవితాల్లో మార్పు రావడంలేదని అన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం పోరాటాలను తీవ్రతరం చేయాలని దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా మే ఒకటో తారీకు న అన్ని గ్రామాల్లో, పట్టణాలు, కార్మిక అడ్డాలలో ఏఐటీయూసీ జెండాలు ఎగరవేసి ర్యాలీ లు సభలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి అధ్యక్షత జరిగిన సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు కే ఎస్ రెడ్డి,దొటి వెంకన్న, సహాయ కార్యదర్శులు నూనె వెంకటేశ్వర్లు,బరిగల వెంకటేష్, కోశాధికారి దొనకొండ వెంకన్న, వి లెనిన్,శ్రీను, ఏ మల్లయ్య,సైదులు, పి. నాగరాజు, నీల వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.



## తిప్పర్తి లో 1989--90 బ్యాచ్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 20 (వార్తా వేదిక సూర్య )

1989--90 బ్యాచ్ పూర్వవిద్యార్థుల సమ్మేళనం తిప్పర్తి జిల్లా పరిషత్ హైస్కూల్ లో జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పాలిటెక్నిక్ ఎస్సీ, ఎస్టీ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మీసాల సైదులు మాట్లాడుతూ..పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరగడం ఎంతో ఆనందకరమైన విషయం. ఈ సందర్భంగా తమ గురువులను సన్మానించడం, వారి ఆశీస్సులు తీసుకోవడం అనేది ఎంతో గొప్ప సంప్రదాయం అన్నారు. గురువులు వేసిన శిక్షలు, మనం చేసిన అల్లర్లు, అప్పటి స్నేహాలు, అమ్మాయి, అబ్బాయిల మధ్య ఉన్న అమాయకమైన అనుబంధం. ఈ జ్ఞపకాలు మళ్లీ గుర్తుచేసుకోవడం మనసుకు అపారమైన ఆనందాన్ని ఇస్తుంది. ఇలాంటి రోజులు మళ్లీ మళ్లీ రావాలని ప్రతి ఒక్కరి మనసులో కోరిక ఉంటుంది. 36 సంవత్సరాల తర్వాత మళ్లీ కలుసుకోవడం నిజంగా గొప్ప విషయం అన్నారు. నాకు తెలిసినంతవరకు 1984 తర్వాతి బ్యాచులు మాత్రమే పూర్వవిద్యార్థుల సమ్మేళనాలు నిర్వహించాయి. కానీ 1984 బ్యాచ్ మాత్రం ఇంకా అలాంటి సమ్మేళనం జరుపుకోలేదు అనిపిస్తోంది. తిప్పర్తి హైస్కూల్‌లో 1984 లోనే విద్యార్థి ఎన్నికలు నిర్వహించాలని ఏపూరి జానయ్య, రవీందర్ రెడ్డి, ఎం. సైదులు, ఎం. శ్రీనివాస్ రెడ్డి అప్పటి ప్రధానోపాధ్యాయులు కట్ట జానారెడ్డి, వెంకటాచారి,చొక్కా రావు ని కోరారు. ఆ ఎన్నికల్లో రవీందర్ రెడ్డి పై ఏపూరి జానయ్య అధ్యక్షుడి గా గెలిచారు. జనరల్ సెక్రటరీగా మంత్రాల శ్రీనివాస్ రెడ్డి పై మీసాల సైదులు గెలిచారు. ఇది నేను చెప్పడం వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశ్యం ఏమిటంటే

గెలుపు, ఓటములు కులం లేదా డబ్బుల మీద ఆధారపడవు; వ్యక్తిత్వం మీద ఆధారపడతాయని అన్నారు. 1889-90 బ్యాచ్ గురువులకు,మిత్రుల అందరికి నా హృదయపూరక అభినందనలు, మరియు ,ఆర్గనైజెర్స్ గోలి వెంకన్న, రవికుమార్,మల్లేష్, సూర్య, పుల్లారెడ్డి, నిశి, నిరీక్షణ, పల్వాయి కరుణకుమార్ అందరికి నా ప్రత్యేక అభినందనలు తెలిపారు.అలాగే 1984 బ్యాచ్ కూడా త్వరలో ఒక గొప్ప పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించాలని ఆశిస్తున్నాను కోరుకుంటున్నాను అన్నారు.

## ఉచిత గుండె, చాతి చెకప్ సేవలు సద్వినియోగం చేసుకోగలరు

### ఉప సర్పంచ్ కొడిదాల పద్మ వెంకటయ్య

దేవరకొండ ఏప్రిల్ 20 ( వార్తా వేదిక సూర్య):-



కొండమల్లేపల్లి పట్టణ బీసీ కాలనీ ఆంజనేయస్వామి గుడి వెనుక ఉన్న హాస్పిటల్ లో40 సంవత్సరాల నుండి 60 సంవత్సరాలలోపు ఉన్న పెద్దమనుషులకు చాతి (చెస్ట్ )ఎక్స్రే తీసి చెకప్ చేయబడుచున్నది. ఈ ఉచిత సేవలకు ఉప సర్పంచ్ కొడిదాల పద్మ వెంకటయ్య రిపన్ కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కొండమల్లేపల్లి ప్రజలు ఉచిత గుండె మరియు ఛాతి చెకప్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్స్ వస్కుల బక్కలయ్య, వస్కుల శ్రీను. మరియు రాజశేఖర్ సిహెచ్ఓ సుగుణ భాయ్ హెల్త్ సూపర్వైజర్ కె రాణి ఎస్ టి ఎల్ ఎస్ వసంత సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ మల్లికార్జున హెల్త్ అసిస్టెంట్. రవి సిస్టర్స్ ఉ ఆశా వర్కర్స్ హాజరు అయ్యారు

## తీవ్రమైన ఎండల దృష్ట్యా సెన్సస్ -2027 శిక్షణ తరగతుల సమయాన్ని మార్చాలి

### టి.ఎస్.ఐ.టి.ఎఫ్ నల్లగొండ జిల్లా కమిటీ

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 20 (వార్తా వేదిక సూర్య )

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న కారణంగా అదేవిధంగా వాతావరణ శాఖ సూచన మేరకు, సెన్సస్ 2027 శిక్షణ తరగతుల సమయాన్ని మార్చాలి మధ్యాహ్నం 1 గంట నుండి 4 గంటల ప్రాంతంలో అత్యధిక ఉష్ణోగ్రత కారణంగా శిక్షణకు హాజరయ్యే ఉపాధ్యాయులు వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉన్నందని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నల్లగొండ జిల్లా కమిటీ తెలిపింది. సోమవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ జె. శ్రీనివాస్ ని కలిసి, టి . ఎస్.యు.టి.ఎఫ్ తరపున ఎడ్ల సైదులు, నర్రా శేఖర్ రెడ్డి లు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం శేఖర్ రెడ్డి మాట్లాడుతూ, సెన్సస్ విధుల్లో భాగంగా ఉపాధ్యాయులకు మూడు విడతలుగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారని, ప్రస్తుతం అమలులో ఉన్న ఉదయం 9:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమయం ఉపాధ్యాయుల ఆరోగ్యానికి ఏమాత్రం అనుకూలంగా లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయాన్ని మినహాయించి, ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే శిక్షణ తరగతులు నిర్వహించేలా చూడాలని అడిషనల్ కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఉపాధ్యాయుల ఇబ్బందులను అర్థం చేసుకుని, జిల్లా యంత్రాంగం సానుకూలంగా స్పందించి తక్షణమే సమయ మార్పునకు ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన కోరారు. ఈ విషయమై రాష్ట్రంలో కూడా మా యూనియన్ తరపున డైరెక్టర్ కి మా రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసిందని ఆయా కలెక్టర్ల పరిధిలో వారే దానికి ప్రత్యామ్నాయ సమయపాలన మార్చుకునే విధంగా తగు చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ సూచించినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీ.ఎస్.యూ.టీ.ఎఫ్ జిల్లా కార్యదర్శులు గేర నరసింహ మరియు కొమర్రాజు సైదులు,ఉపాధ్యాయ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఓటర్ జాబితా మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**• వీడియో కాన్ఫరెన్స్ లో**

**ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**






(యాదాద్రి భువనగిరి బ్యూరో ), ఏప్రిల్ 20 వార్తా వేదిక సూర్య : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం కింద చేపడుతున్న మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. సోమవారం, హైదరాబాదు నుంచి సంబంధిత ఉన్నతాధి కారులతో కలిసి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ కొన్ని రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ మ్యాపింగ్ 95 శాతానికి పైగా పూర్తయిందని, తెలంగాణలో కూడా అదే స్థాయిలో పురోగతి సాధించేందుకు సమన్వయంతో కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈఆర్ఓలు, ఏఈఆ ర్వోలు తమ పరిధిలోని బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఓలు), సూపర్వైజర్లకు స్పష్టమైన దిశానిర్దేశం అందిస్తూ క్షేత్రస్థాయిలో పనులను క్రమబద్ధంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. బూత్ స్థాయిలో రాజకీయ పార్టీల ఏజెంట్ల నియామకంపై ఇప్పటికే ఆయా పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినందున, వారి సహకారాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తమ పరిధిలోని బిఎల్ఓలతో సమన్వయం పెంచుకుని మ్యాపింగ్ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించేందుకు ముందుకు రావడం ద్వారా మిగిలిన ప్రాంతాల్లో పనులను వేగంగా పూర్తి చేయవచ్చని తెలిపారు. ఈ ప్రక్రియలో ఖచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి ,భువనగిరి తాసిల్దార్ జగన్మోహన్ ప్రసాద్ , ఎలక్షన్స్ సెల్ సూపర్డెండ్ కృష్ణ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మానుక ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు



కోరుట్ల, ఏప్రిల్, 20:(వార్త వేదిక సూర్య ): కోరుట్ల నియోజకవర్గ కేంద్రం కోరుట్ల పట్టణంలో ఆనంద్ నగర్ ఏకలవ్య నగర్ కాలనీలో టిడిపి అధినేత ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగినవి. ఈ సందర్భంగా మానుక ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కాక దేశ రాజకీయాలలో పరిణితి చెందిన రాజనీతిజ్ఞుడు,పరిపాలన సమర్థుడు, ఆధునికతకు పట్టం పట్టే నాయకుడు, తన విలువలు, వీజన్ తో యువతరానికి ఒక ల్యాండ్ మార్కులా నిలిచే మార్గదర్శి, సంక్షోభ సమయాలలో కూడా అద్భుతాలు సృష్టించగల అపర చాణక్యులు,నిరంతరం ప్రజా శ్రేయస్సు కొరకు ఆలోచించి అలుపెరుగని నాయకులు మన అధినేత ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు అని ప్రవీణ్ కుమార్ తెలిపినారు. ఈ సమావేశంలో తెలుగుదేశం నాయకులు కటకం మహదేవ్, బాలే మారుతి,గజ్జల రాజ గణేష్, అంజయ్య,పాతర్ల విజయ్,ఎండి రఫీ,ఆసిఫ్,నజీమ్ అలాగే తెలుగు మహిళ నాయకురాలు విజయలక్ష్మి, జ్యోతి, వాణి,సువర్ణ, శాంత,పద్మ,కళ్యాణి,పారిజాత తదితరులు పాల్గొన్నారు.

## బసవేశ్వరుడు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



మోత్కూరు, ఏప్రిల్ 20 (వార్త వేదిక సూర్య): బహుజనుల కోసం నిరంతర కృషి చేసిన సామాజిక విప్లవ వీరుడు బసవేశ్వరుడు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని లింగాయత్, లింగ బలిజ గౌరవ అధ్యక్షులు విజయ్ కుమార్, అధ్యక్షులు పట్టూరి అంజయ్య పిలుపునిచ్చారు. సోమవారం బసవేశ్వరుడు 893 వ,జయంతి సందర్భంగా మోత్కూరులో ఆయన విగ్రహానికి లింగాయత్, లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ శతాబ్దంలోనే అంటరానితనం, స్త్రీ,పురుష లకు వివక్ష లేని సమాజం కోసం బసవేశ్వరుడు పోరాడారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో లింగ బలిజ సంఘం మండల నాయకులు సురుగురు సురేష్, జలంధర్, పట్టూరి శివ, ఆరాని శశిధర్, పట్టూరి కోటి, ఆకుల సోమయ్య, జాంజూరి బిక్షపతి, గూండా శివ, అల్లం ఈశ్వరయ్య, మడిగే భూమయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మారం చెరువు నుంచి మట్టి తరలింపును వెంటనే నిలిపివేయాలి

**- బారాస జిల్లా అధ్యక్షులు రామకృష్ణారెడ్డి**



మోత్కూరు (అడ్డగూడూరు) : ఏప్రిల్ 20 ( వార్త వేదిక సూర్య): మండలంలోని ఎమ్మెల్యే స్వగ్రామమైన ధర్మారం చెరువు నుంచి వలిగొండ మండలం నందనం గ్రామానికి చిట్కాబట్టీల అవసరాల కోసం టిప్పర్లతో మట్టి తరలిస్తున్నారని,ఈ మట్టి తరలింపును వెంటనే నిలిపివేయాలని బారాస జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం అడ్డగూడూరు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఉండే రైతులకు పొలాలకు ఎరువుల,లెవెలింగ్, రోడ్డు సమతలీకరణ వాడుకోవాల్సిన చెరువు మట్టిని ఇతరులకు అమ్ముకోవడం గ్రామ వనరులకు దోపిడీకి నిదర్శనమన్నారు. చెరువు మట్టిని బయటకు తీయడం వల్ల నీటి నిర్వ సామర్థ్యం తగ్గిపోతుందని, వేసవిలో చెరువు ఎండిపోయి భూగర్భజరాలు తగ్గిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులో మట్టి తీయడం వల్ల రైతులకు నీరు అందగా దిగుబడి తగ్గుతుందని తద్వారా ఆర్థికంగా నష్టపోతారన్నారు. అదేవిధంగా అడ్డగూడూరు మండల పరిధిలోని బారాస బలపరిచి గెలిచిన సర్పంచుల గ్రామాలలో ఎన్.ఆర్.జి.ఎస్. నిధుల కింద మంజూరైన ఆ నిధులను స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.గ్రామాలకు నిధులు ఇవ్వకుండా అడ్డుకోవడం చూస్తుంటే ఇదేనా కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన అంటే ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే అన్ని గ్రామాలకు సమానంగా అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.

## గ్రామాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి




మోత్కూరు, ఏప్రిల్ 20 ( వార్త వేదిక సూర్య ): గ్రామాలలో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై సిపిఎం జిల్లా కమిటీ పిలుపుమేరకు సోమవారం మండలంలోని రాగిబావి గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆ గ్రామపంచాయతీ కార్యదర్శి స్వాతి"కి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామ పంచాయతీ ఏర్పాటై గత 10 సంవత్సరాలు దాటిన నేటికీ సొంత భవనం లేదని వెంటనే ఆ భవవాన్ని నిర్మించాలని, గ్రామంలో అనేకచోట్ల విద్యుత్ తీగలు క్రిందికి వేలాడుతున్నాయని వాటిని సరిచేయాలన్నారు. అదేవిధంగా డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మించాలని, ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పానుగుళ్ళ లక్ష్మి ,సిపిఎం మండల కమిటీ సభ్యులు వానుగుల్ల రమేష్, ఏన్నం వెంకట్ రెడ్డి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కీటక జనత వ్యాధుల నివారణకు సమన్వయంతో పనిచేయాలి

**- డిఎం అండ్ హెచ్ ఓ మనోహర్**



( యాదాద్రి భువనగిరి బ్యూరో ), ఏప్రిల్ 20 వార్తా వేదిక సూర్య

జిల్లా సమన్వయ కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయంలోని మినీ హాల్ లో జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం మనోహర్ గారి ఆధ్వర్యంలో వివిధ శాఖల విభాగధిపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి డిఎంహెచ్ఓ డాక్టర్ ఎం మనోహర్ గారు మాట్లాడుతూ.. కీటక జనత వ్యాధుల నివారణకు అన్ని శాఖల సమన్వయంతో పనిచేసి వ్యాధులను అరికట్టాలని సూచించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డే.. డ్రై డే కార్యక్రమంలో భాగంగా వివిధ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో నీటి నిల్వలు, మురికి కాల్వలల్లో నీరు నిల్వ లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. నిల్వ నీటిలో దోమల లార్వాలు అభివృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్, థీమా ఫాస్ వంటి రసాయనాలను చల్లి లార్వ అభివృద్ధిని అరికట్టడం వల్ల దోమల వ్యాప్తిని నివారించవచ్చు అన్నారు. పాఠశాలలు, వసతి గృహాలు పరిశుభ్రతను పెంపొందించి వ్యాధుల బారిన పడకుండా చూడాలని సూచించారు. డిపిఆర్ఓ నాగిరెడ్డి గారు మాట్లాడుతూ.. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచించారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎన్ వంశీకృష్ణ గారు మాట్లాడుతూ ... కీటక జనిత వ్యాధుల నివారణకు అన్ని విభాగాల అధికారులు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ వీణ, మున్సిపల్ , విద్యాశాఖ, పంచాయతీరాజ్, ఐసిడిఎస్, డిపిఆర్ఓ, సోషల్ వెల్ఫేర్, బిసి, ఎస్. టి వెల్ఫేర్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, జిల్లా మలేరియా విభాగ అధికారులు పాల్గొన్నారు.

# మునిపంపులలో అఖిల పక్షాల ఆధ్వర్యంలో ముందస్తు బడిబాట



రామన్నపేట, ఏప్రిల్ 20,(వార్తా వేదిక సూర్య): మండలం మునిపంపులు ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, అఖిల పక్షాల ఆధ్వర్యంలో ముందస్తు బడిబాట కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా "మన ఊరు వెలగాలంటే.. ఊళ్ళో బడిని వెలిగించాలి" , "మన ఊరి బడిలోనే మన పిల్లలను చేర్పించాలి" ,మన బడిని మనమే కాపాడుకోవాలని "ఊళ్ళోని ప్రభుత్వ బడిని కాపాడుకుంటేనే – మన ఊరు బాగుపడుతుంది"" అని మునిపంపుల సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దొడ్డి స్వామి అన్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద " మన ఊరు– మన బడి – మన బాధ్యత" అనే కరపత్రం ను ఆవిష్కరించి ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. తదుపరి గ్రామంలోని ప్రైవేటు పాఠశాలలకు వెళ్ళే విద్యార్థుల ఇళ్ళకు పాఠశాలల ఉపాధ్యాయులు, అఖిల పక్షాల నాయకులతో కలిసి వెళ్ళి చైతన్యం చేసేలా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో లభిస్తున్న సౌకర్యాల గురించి ఉపాధ్యాయుల గురించి, ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునే ఆవశ్యకతను గుర్తు చేస్తూ ఊర్లోని పిల్లలందరూ ఊరు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా అందరూ సహకరించాలని, ఊరు బడిని కాపాడుకునేలా ప్రయత్నం చే యవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాళ్ళ క్రాంతి, వార్డుమెంబర్లు యదాసు లక్ష్మణ్, మేకల జలందర్, కట్టా అరుణ్ కుమార్, గ్రామ అఖిల పక్ష నాయకులు మన్నె పద్మారెడ్డి, కట్టా యాదయ్య, గాదె పారిజాత, తాల్లపల్లి.జితేందర్,ఏలూరి రవి, తొలిపునూరి.చంద్రశేఖర్, చైర్మెన్ బత్తిని వెంకటమ్మ, రచ్చా రమేష్,గంటేపాక.శివ, ప్రైమరీ స్కూల్ ఎవీ జ.దర్మేందర్, పాఠశాల ఉపాధ్యాయులు తిరుమల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, వసంత, మనోహర్, రేవతి, మంజుల, సరోజ, కంచి రవికుమార్, నాగలక్ష్మి, శ్రీశైలం, సునిత, రాకేశ్, గణేశ్ , అంగన్ వాడీ టీచర్ బద్రున్నీసా, గ్రామ ప్రజలు యువతీ యువకులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య జన్మదిన వేడుకలు



రామన్నపేట, (వార్తా వేదిక సూర్య) ఏప్రిల్ 20 : రామన్నపేట మండల కేంద్రంలో గౌరవ నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య జన్మదిన సందర్భంగా పట్టణ కేంద్రంలోని సుభాష్ సెంటర్ వద్ద బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం పల్లివాడ ఇంద్రపాలనగరం సర్పంచులు కంభంపాటి శ్రీనివాస్ గర్దాస్ విక్రమ్ జిల్లా నాయకులు బద్దుల రమేష్ ఎస్.కె చాంద్ మండల పరిషత్ మాజీ కోఆప్షన్ మెంబర్ ఎండి అమీర్ పట్టణ కార్యదర్శి జాడ సంతోష్ యువజన విభాగం మండల అధ్యక్షుడు బత్తుల వెంకన్న ఉప సర్పంచులు నల్ల స్వామి చొప్పరి నరసింహ నాయకులు మంటి లింగస్వామి బొడ్డుఆల్లయ్య రవ్వ నరసింహ మందడి శ్రీధర్ రెడ్డి రాస వెంకటేశ్వర్లు చిన్నపాక శ్రీనివాసులు గర్దాస్ కరుణాకర్ బుర్ర శ్రీశైలం నల్ల సైదులు బొడ్డుపల్లి రాజు ఆవుల శ్రీధర్ మేడి కృష్ణ వంగాల యాదయ్య నారపాక రమేష్ వర్కల మల్లేష్ పోషబోయిన లింగయ్య బొల్లం నరసింహ వంగాల సాయికుమార్ గర్దాసు శ్రీకాంత్ పోషబోయిన నాగరాజు రమేష్ శ్రీను వెంకటేష్ యాదయ్య తదితరులు పాల్గొనడం జరిగింది.

# కాంగ్రెస్ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాలి

**- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు**

**కాకి ఈశ్వర్ ముదిరాజ్**



మహేశ్వరం ఏప్రిల్ 20 వార్త వేదిక సూర్య : మహేశ్వరం పట్టణ శాఖ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం,రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కేంద్రం కాకి ఈశ్వర్ ముదిరాజ్ ఫంక్షన్ హాల్లో జరిగిన మహేశ్వరం పట్టణ శాఖ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్, మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ప్రతి ఒక్క పథకం ప్రజలకు చేరవేసేలా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పని చేయాలని నూతనంగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునేవారు దరఖాస్తులు పెట్టుకోవచ్చని అన్నారు కష్టపడి పనిచేసే కార్యకర్తలకు సముచిత స్థానాలు లభిస్తాయని అన్నారు ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా కు నియామక పత్రం అందించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్. శివగంగా ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్. అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మొహమ్మద్ అబ్దుల్ జావిద్. అల్లె బిక్షపతి. మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షులు బంగారిగల్ల లాజర్. ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా. గ్రామపంచాయతీ సభ్యులు టీ బేబీ మక్కాజి. వత్తులశాలిని సన్నీ కుమార్. మహేశ్వరం మాజీ ఉప సర్పంచ్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు కర్రెల రాములు ముదిరాజ్.కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సమన్వయకర్త ఇందిరమ్మ కమిటీ సభ్యులు స్వర్ణగంటి సుభాష్.శివగంగా ఆలయ కమిటీ డైరెక్టర్లు పోతర్ల తిరుపతయ్య యాదవ్. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి రామచంద్రయ్య ముదిరాజ్. కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షులు గడగూటి హరికృష్ణ ముదిరాజ్. సేవాదళ్ మండల అధ్యక్షుడు శెట్టి అశోక్. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిపార్ట్మెంట్ మండల చైర్మన్ మొహమ్మద్ ఇర్షాద్. కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు స్వర్ణ గంటి ఆకాష్. కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం 10వ వార్డు ఇన్చార్జి కాకి మల్లేష్ ముదిరాజ్.13 వ వార్డ్ ఇన్చార్జ్ మూనావత్ అనిల్ నాయక్.14 వ వార్డ్ ఇన్చార్జ్ పుట్ల గారి చందు. పార్టీ సీనియర్ నాయకులు మోతే యాదయ్య. అల్లే బాలేష్. ఏపూరి రాజు. ఏపూరి నరసింహ. గగనం ఆంజనేయులు. దూసకంటి రవీందర్. యువజన కాంగ్రెస్ నాయకులు ముచ్చింతల శ్రీను. పినామౌని శ్రీకాంత్ ముదిరాజ్. తదితరులు పాల్గొన్నారు,

# నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు



భూదాన్ పోచంపల్లి ఏప్రిల్ 20 ( వార్త వేదిక సూర్య ): మున్సిపల్ పరిధిలోని ముక్తాపూర్ లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,76వ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముక్తాపూర్ వీరాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు బిస్కెట్లు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ శాఖ అధ్యక్షుడు కుక్కలి మహేష్, సీనియర్ నాయకుడు బైరు లక్ష్మయ్య, పట్టణ శాఖ కార్యదర్శి కురువేటి శ్రీనివాస్, చిలువేరు గోవర్ధన్, పోతగల జంగయ్య పైసలు పాల్గొన్నారు.

## సాంస్కృతిక సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మీసాల గణేష్ నియామకం



భూదాన్ పోచంపల్లి ఏప్రిల్ 20 (వార్త వేదిక సూర్య ): తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సాంస్కృతిక సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా భూదాన్ పోచంపల్లి మండలం భీమనపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ జానపద కళాకారుడు మీసా ల గణేష్ నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు చక్రాల రఘు నియామకపు ఉత్తర్వులు అందజేశారు. తన నియామకం కోసం కృషి చేసిన ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, పిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, సాంస్కృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు చక్రాల రఘు, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

## యాదిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన రామకృష్ణారెడ్డి



మోత్కూరు, ఏప్రిల్ 20 ( వార్తా వేదిక సూర్య): మండలంలోని రాగిబావి గ్రామానికి చెందిన వార్డు సభ్యులు ఎలుగు యాదిరెడ్డి పితృవియోగం ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బారాస జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి సోమవారం యాదిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బారాస గ్రామ శాఖ అధ్యక్షులు పసునూరి సత్తిరెడ్డి, మాజీ సర్పంచ్ రాంపాక నాగయ్య, బారాస గ్రామ శాఖ నాయకులు మెండు చంద్రశేఖర్ రెడ్డి,పులగం దామోదర్ రెడ్డి, రాంపాక మల్లేష్,అరిగే సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## గోల్ షాట్ బాల్ జిల్లా చైర్మెన్ గా తానయ్య



మోత్కూరు, ఏప్రిల్ 20( వార్త వేదిక సూర్య ): గోల్ షాట్ బాల్ జిల్లా చైర్మెన్ గా మోత్కూరు సేక్రెడ్ హార్ట్ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రిన్సిపాల్ (పాదర్) తానయ్య ఎన్నికయ్యారు.సోమవారం ఆ పాఠశాలలో ఆవరణంలో జిల్లా గోల్ షాట్ బాల్. అసోసియేషన్ సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఫాదర్ తానయ్య మాట్లాడుతూ జిల్లాలో క్రీడల అభివృద్ధికి తన వంతు నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గోల్ షాట్ బాల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం సోమశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి చాంద్ పాషా, కార్యవర్గ సభ్యులు ఎం. యాదయ్య, ఎండి అక్బర్, ఎం. సత్యనారాయణ, సోమ ప్రవీణ్ పాల్గొన్నారు.

యాదాద్రి భువనగిరి
సంపుటి : 1 సంచిక : 325
వార్త వేదిక సూర్య
యాదాద్రి భువనగిరి
మంగళవారం,
ఏప్రిల్ 21, 2026

## ఐకెపి సెంటర్లలోనే ధాన్యం విక్రయించుకోవాలి



**మోత్కూరు, ఏప్రిల్ 20 ( వార్తా వేదిక సూర్య ):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే రైతులు విక్రయించుకోవాలని తహశీల్దార్ పి.జ్యోతి అన్నారు. సోమవారం మండలంలోని సదర్శాపురం, ముషిపట్ల ఐకెపి సెంటర్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు 2389 ధర ను కల్పిస్తుందని, దళారుల చేతిలో మోసపోకుండా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ. సుమన్, ఆయా గ్రామాల సర్పంచులు మునుకుంట్ల నీలకంఠం, పైళ్ల నర్శిరెడ్డి, ఏపిఎం కె పక్కిరయ్య,వి.ఓ.బి , సీసీలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిమాపక వారోత్సవాలు ముగింపు



**మోత్కూరు, ఏప్రిల్ 20 (వార్త వేదిక సూర్య ):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు సోమవారం అగ్నిమాపక కేంద్రం కార్యాలయంలో ముగిశాయి. ఫైర్ స్టేషన్ ఎస్సై బీముడు మాట్లాడుతూ గత వారం రోజుల నుంచి అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు పాఠశాల కళాశాలల కార్యాలయాలు ఆసుపత్రులలో తీసుకోవాల్సిన అత్యవసర పరిస్థితులు (జాగ్రత్తలు) ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ ఫైటర్ జి రవీందర్, ఫైర్ ఫైటర్ డి నరేష్, సిబ్బంది రవీందర్ నాయక్,ప్రభుజ్యోతి, ఎం . డి.సిద్ధిక్ స్థానికులు నాది నేనే సోమేశ్వర్, రవి, మల్లేశం, నర్సయ్య. తదితరులు పాల్గొన్నారు.

## అరూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**వలిగొండ, ఏప్రిల్ 20 (వార్తావేదిక సూర్య)** వలిగొండ మండలంలోని అరూర్ గ్రామంలో రైతులకు ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం రోజు భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు తమ పంటను మధ్యవర్తుల జోక్యం లేకుండా నేరుగా ప్రభుత్వానికి అమ్ముకునే విధంగా ఈ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.రైతులకు కనీస మద్దతు ధర కల్పించడంతో పాటు తక్షణ చెల్లింపులు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, రైతులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పై ఆరోపణలు చేయడం తగదు

**- మండల కాంగ్రెస్ అధ్యక్షులు జోజి**



**మోత్కూరు, ( అడ్డగూడూరు),ఏప్రిల్ 20 (వార్తావేదిక సూర్య):** మండలంలోని ధర్మారం గ్రామం నుంచి ఆ గ్రామ పంచాయతీ తీర్మానం,ఉన్నతాధికారుల అనుమతి తోనే చెరువు మట్టిని తరలిస్తున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిమ్మనగోటి జోజి తెలిపారు. సోమవారం ఆయన అడ్డగూడూరు మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇటుకల కొరత లేకుండా ఈ ఈ మట్టిని ఇతర ప్రాంతాలకు వినియోగించినట్లు ఇందులో ఎమ్మెల్యే ప్రమేయం ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. కొంతమంది కావాలనే ఎమ్మెల్యే పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బిఆర్ఎస్ పరిపాలనలో బిక్కవోలు వాగులో ఇసుక దోపిడీ జరిగిందని, కాకతీయ పేరుతో పనులు చేయకుండానే నిధులు కాజే చేశారని ఆరోపించారు. సామేల్ నాయకత్వంలో. రోడ్ల నిర్మాణం,ప్రభుత్వ కార్యాలయాలు.మంజూరు వంటి అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. నిధుల కేటాయింపు గతంలో ఉపాధి హామీ నిధులు విషయంలో ఇబ్బందులు ఎదురైనప్పుడు అప్పటి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నిధులు తెచ్చి ఆదుకున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే పై బి.ఆర్.ఎస్. నాయకులు బురద జల్లే ప్రయత్నం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ లింగాల నర్సిరెడ్డి, సర్పంచులు ముక్కాముల శ్రీకాంత్ , రాచకొండ, చేడే అంబేద్కర్, చిత్తలూరి సోమనారాయణ, బాలశౌరి, నాయకులు బొమ్మగాని లక్ష్మయ్య లాదినేని పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కాంగ్రెస్ లక్ష్యం

▸▸ **ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**





**యాదగిరిగుట్ట ఏప్రిల్ 20 ( వార్త వేదిక సూర్య ):** అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. సోమవారం ఆయన యాదగిరిగుట్టలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు.

పట్టణంలోని బస్ స్టాండ్, పాతగుట్ట రోడ్డులో వేసవి దృష్ట్యా ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు ఉపశమనం కలిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పట్టణం లోని 2వ వార్డు, 3వ వార్డుల్లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. రహదారి సౌకర్యాలు మెరుగు పడటం వల్ల ప్రజల రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. యాదగిరిగుట్ట మండలం గౌరాయపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రైతులకు మద్దతు ధర కల్పించే లక్ష్యంతో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను విక్రయించు కునేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. యాదగిరి గుట్టలో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తీసుకురావడం కోసం 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ చేశారు. భవిష్యత్తులో ఈ ఆస్పత్రి ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పట్టణంలో నిర్మించిన రెండు ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు పట్టు బట్టలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి గౌరవ ప్రదమైన నివాసం కల్పించడం ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, యాదగిరిగుట్ట ప్రాంతాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, వ్యవసాయం, గృహ నిర్మాణం వంటి అన్ని రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజల అవసరాల మేరకు మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాలలో యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, వైస్ చైర్మన్, బరిగే రమ్యా రామచందర్, బూడిద మధు, బందారపు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# వడ్డే ఓబన్న జీవితం ముందు తరాలవారికి మార్గదర్శకం

▸▸ **వడ్డే ఓబన్న విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న బీర్ల**



**యాదగిరిగుట్ట ఏప్రిల్ 20 ( వార్త వేదిక సూర్య ):** తొలి స్వాతంత్ర్య సమరయోధుడు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేనాధిపతి వడ్డే ఓబన్న విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ తో కలిసి, ఎంఆర్ఓ ఆఫీస్ ఆవరణలో వడ్డే ఓబన్న విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వడ్డెర కులస్థులతో పాటు పలు పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు



మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో వడ్డె ఓబన్న సేవలు అనిర్వచనీయమని తెలిపారు. రేనాటి వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి సైన్యాధ్యక్షుడిగా ఉంటూ బ్రిటిష్ వారి సేనలపై సమరసింహంలా విరుచుకుపడి మూడు వేల మంది బ్రిటిష్ సైనికులను మట్టిపెట్టారని కొనియాడారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుదామంటూ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి అయిలమల్లు, జిల్లా అధ్యక్షుడు పల్లపు బాలయ్య, జిల్లా గౌరవ అధ్యక్షుడు దండ్ల వెంకటయ్య, యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, శివరాత్రి దానయ్య, వడ్డెర నాయకులు, కులస్థులు, తదితరులు పాల్గొన్నారు...

## స్వామివారి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి



**యాదగిరిగుట్ట ఏప్రిల్ 20 ( వార్త వేదిక సూర్య ):** తెలంగాణ ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని సోమవారం ఆలేరు మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం గర్భగుడిలో స్వయంభు నారసింహుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మంటపంలో ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేసి స్వామి వారి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.

## కెజిబివిని సందర్శించిన తహశీల్దార్



**మోత్కూరు, ఏప్రిల్ 20 ( వార్త వేదిక సూర్య) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని తహశీల్దార్ పి.జ్యోతి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు..వంటగదిని పరిశుభ్రంగా ఉండేలా ఎప్పటికప్పుడు శానిటైజర్ చేయాలని సూచించారు విద్యార్థులకు అందిస్తున్న బియ్యం,నిత్యవసర సరుకులను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం వంటలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఆర్.ఐ. సుమన్ కేజీబీవీ ఎస్. ఓ.యాదమ్మ ఉన్నారు.

# ప్రభుత్వ భూముల అక్రమ తవ్వకాలపై ఆందోళన

▸▸ **ఎమ్మార్వో అప్పలనాయుడు కు వినతిపత్రం అందించిన పీపుల్ వాయిస్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు**




**మహేశ్వరం, ఏప్రిల్ 20 (వార్త వేదిక సూర్య):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలో ప్రభుత్వ భూముల పరిరక్షణపై పీపుల్ వాయిస్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం మండల ఎంఆర్ఓకు వివిధ ప్రజా సమస్యలపై మెమోరాండం సమర్పించారు. మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను పూర్తిస్థాయిలో సర్వే చేసి, స్పష్టమైన హద్దులు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ముఖ్యంగా దుబ్బచర్ల గ్రామంలోని సర్వే నంబర్లు 40, 81/1లోని ప్రభుత్వ అసైన్డ్ భూములను తక్షణమే సర్వే చేయాలని కోరారు. ప్రభుత్వ మరియు అసైన్డ్ భూముల్లో రాత్రివేళల్లో మైనింగ్ మాఫియా అక్రమంగా మట్టి తవ్వకాలు నిర్వహిస్తూ, అడ్డగోలుగా తరలింపులు చేస్తున్నారని వారు ఆరోపించారు. ఈ చర్యల వల్ల ప్రభుత్వానికి నష్టం కలగడంతో పాటు భవిష్యత్తులో భూములపై వివాదాలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు అక్రమ తవ్వకాలను అరికట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు. దీనిపై ఎంఆర్ఓ తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు గన్నోజు మహేష్ చారి, ప్రధాన కార్యదర్శి నడ్డి నర్సింహా, ఉపాధ్యక్షులు పి. అశోక్, కార్యదర్శి యాపచెట్టు యాదగిరి, కోశాధికారి పి. దేవేందర్, ఎర్ర రాజు, నడ్డి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చినమాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం

▸▸ **తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా రెండో విడత విడుదల**

▸▸ **అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అల్లే బిక్షపతి**



**మహేశ్వరం ఏప్రిల్ 20 వార్త వేదిక సూర్య** మహేశ్వరం నియోజకవర్గ కేంద్రం రైతు వేదికలో తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా రెండో విడత విడుదల చేస్తున్న సందర్భంలో వీడియో కాన్ఫరెన్స్ వీడియో టెలికాస్ట్ లో పాల్గొన్న మహేశ్వరం మండల వ్యవసాయ అధికారిని అప్సియా బేగం. అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అల్లే బిక్షపతి. తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్. శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్. కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షులు బంగారుగళ్ల లాజర్. మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఇందిరమ్మ కమిటీ సభ్యులు స్వర్ణగంటి సుభాష్. సేవాదళ్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షులు గదగూటి హరికృష్ణ ముదిరాజ్. కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం 14 వ ఇన్చార్జ్ పుట్ల గారి చందు. 10వ వార్డు ఇన్చార్జి కాకి మల్లేష్ ముదిరాజ్. కాంగ్రెస్ పార్టీ నాయకులు గగనం ఆంజనేయులు. పినమోని శ్రీకాంత్ ముదిరాజ్. రైతులు తడకల భాస్కర్. భాను ప్రకాష్. కర్రల ప్రవీణ్ ముదిరాజ్. తదితరులు పాల్గొన్నారు.







Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305**, Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**